PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 27 | విజయవాడ, ఆగస్టు 2024 | 4 పేజీలు వెల : 2.00

Vol No | Vijayawada, August 2024 | Rs

అభయ ఘోష

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక

## మరో హత్యాచారం జరగనిదే మేల్కోమా!



ఈ మధ్య మహిళలే లక్ష్యంగా దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆసుపత్రులలో మహిళా భద్రత కోసం చర్యలు తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మారేందుకు దేశం మరో హత్యాచారం జరిగేదాకా వేచి చూడలేం. మృతదేహాన్ని దహన సంస్కారాలకు అప్పగించిన మూడు గంటల తర్వాత ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేశారు? ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారు? అతని ప్రవర్తనపై అనుమానాలు వున్నప్పుడు వెంటనే మరో కాలేజీకి అతన్ని ఎలా నియమించారు? ఇంత తీవ్రమైన నేరం జరుగుతుంటే ఆస్పత్రిలోని వారు ఏం చేస్తున్నారు?

**జస్టిస్ డి.వై.చంద్రచూడ్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి**

# నిర్భయ నుండి అభయ వరకు...



**మరియం ధావలే**





బాధితురాలికి న్యాయం కోరుతూ విశాఖ బీచ్ రోడ్‌లో జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ

> **అమానుషాలు, అకృత్యాలు జరిగినప్పుడు బాధితురాలినే నేరస్తురాలిగా చూపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీలో నిర్భయపై జరిగిన దారుణంలోను, ముంబయి సాక్షి మిల్స్‌లో జర్నలిస్టుపై జరిగిన అఘాయిత్యంలోనూ, ఇప్పుడు కోల్‌కతా అభయ విషయంలోనూ అదే జరిగింది. ఈ దుర్మార్గాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. బాధితురాలినే నేరస్తురాలిగా చూపే ప్రయత్నాలను ఎంత మాత్రం సహించకూడదు.**

షేక్స్పియర్ నాటకం 'హామ్లెట్'లో, డెన్మార్క్ రాజ్యంలో ఏదో కుళ్లింది' అనే డైలాగ్ చాలా ప్రసిద్ధి చెందింది. ఇప్పుడా వాక్యం మమతా బెనర్జీ నాయకత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. తన మిత్రబృందం చేత 'అభయ'గా పిలవబడుతున్న జూనియర్ డాక్టర్, ఆర్.జి. కర్ వైద్య కళాశాల ఆవరణలో, డ్యూటీలో ఉండగా దారుణ హత్యాచారానికి గురైంది. ఇది దేశంలోని పౌరులందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ భయానక ఉదంతాన్ని కప్పిపుచ్చేందుకు నిస్సిగ్గుగా ప్రయత్నించారు. ఇదెంతో గర్హించదగ్గ విషయం. ఈ ఉదంతం ఆగస్టు 9వ తేదీ తెల్లవారుఝామున జరిగింది. ఆ సమయానికి ఆ డాక్టర్ డ్యూటీలో ఉన్నారు. బాధితురాలి తల్లిదండ్రులకు, తమ కుమార్తె బలవన్మరణానికి పాల్పడినట్టు తప్పుడు సమాచారం ఇచ్చారు. పైగా తమ ఒక్కగానొక్క కుమార్తె పార్థివ దేహాన్ని చూడటానికి కూడా కన్నవారు మూడు గంటల పాటు పడిగాపులు పడాల్సి వచ్చింది. చివరికి వారు ఫిర్యాదు నమోదు చేసి ఎఫ్.ఐ.ఆర్ ఫైల్ చేశారు.

ఇంతలోగా అక్కడ పోలీస్ బ్యారక్‌లో పౌర సేవకుడిగా ఉన్న సంజయ్ రాయ్ నేరంతో సంబంధం ఉన్నవాడిగా అరెస్ట్ అయ్యాడు. నేరాన్ని ఛేదించడంలో ఏమాత్రం పురోగతి చూపని రాష్ట్ర పోలీసు వ్యవస్థ నేరస్తులతో కుమ్మక్కు అయినట్టు భావించవలసి వస్తున్నది. పోస్ట్‌మార్టం నివేదికలో, అభయ సామూహిక అత్యాచారానికి, హత్యకి గురైనట్టు వెల్లడి కావడంతో బాధిత తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టు తలుపు తట్టారు. మృతురాలి శరీరం పై దారుణమైన గాయాలు ఉండడం, అవి స్పష్టంగా కనిపిస్తుండడం, జరిగినది హత్య అని తెలుస్తూనే ఉంది. రాష్ట్ర పోలీసులు న్యాయం చేయరన్న భయంతో బాధిత తల్లిదండ్రులు సి.బి.ఐ కేసు దర్యాప్తు చేయాలని, ఆర్.జి. కర్ వైద్య విద్యాలయం మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ సాగిస్తున్న అవకతవకలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ సందీప్ ఘోష్ ప్రవర్తన చాలా అనుమానాస్పదంగా ఉంది. మృతదేహాన్ని చూసిన వెంటనే పోలీసులకు తెలియచేసి, ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాల్సింది పోయి చనిపోయిన డాక్టర్‌నే తన మరణానికి కారణంగా చిత్రించారు. "అంత అర్ధరాత్రి సెమినార్ హాల్‌కి ఆమె ఒక్కర్తీ ఎందుకు వెళ్లాల్సి వచ్చిందంటూ" నిలదీశారు. "ఒక మానసిక రోగి" అంటూ ఎద్దేవా చేశారు. ఆయనెంత అమానుషంగా ప్రవర్తించాడనే విషయాన్ని ఈ మాటలు తెలియచేస్తున్నాయి. పాపం, ఆ డాక్టర్ 36 గంటలు డ్యూటీలో ఉన్నారు. ఆసుపత్రిలో కనీసం టాయిలెట్ సౌకర్యం గాని, కాస్తంత నడుం వాల్చే వసతి గాని లేదు. పనిలో ఉన్న డాక్టర్లకి కనీస వసతులు కల్పించాలన్న ఇంగితం ఆ యాజమాన్యానికి లేనేలేదు. హాస్పిటల్ ఆవరణలో పనిచేసే సిబ్బంది భద్రత, బాధ్యత కూడా తీసుకోలేదు. బాధితురాలిని ఎలా నేరస్తురాలిగా చూపే ప్రయత్నాలు చేస్తారో చెప్పేందుకు ఇది మంచి ఉదాహరణ. ఢిల్లీలో జరిగిన నిర్భయ విషయంలో అయినా, ముంబై సాక్షి మిల్స్‌లో జర్నలిస్టు విషయంలో అయినా ఇదే జరిగింది. వారు కూడా బాధితులనే నేరస్తులను చేశారు. ఇప్పటికయినా ఈ విధానాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాలి. బాధితురాలిని నేరస్తురాలిగా చూపే ప్రయత్నాలను ఎంతమాత్రం సహించరాదు.

ఆర్.జి. కర్ వైద్య విద్య కళాశాలలో జరుగుతున్న అనేక అక్రమాలు సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రధానోపాధ్యయుడు ఆందోళకారుల ఒత్తిడి మేరకు ఇక్కడ రాజీనామాను సమర్పించిన మరుక్షణం కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా నియమితు డయ్యాడు. అయితే, ప్రజల తిరస్కారానికి తలొగ్గి, ఆ తరువాత ఆ నియామకం రద్దయిందన్నది వేరే విషయం. కలకత్తా హైకోర్టు ఈ తొందరపాటు చర్యను వ్యతిరేకించి, ఆయనను సుదీర్ఘ సెలవుపై వెళ్లాల్సిందిగా ఉత్తర్వునిచ్చింది. నిజానికి ఉద్యోగం నుంచి తొలగించవలసిన వ్యక్తికి బదిలీ ఉత్తర్వు ఎలా ఇచ్చింది? ఏ ఇతర వైద్య విద్య సంస్థలో కూడా ప్రధానోపాధ్యాయుడిగా నియమించకూడని తప్పిదమిది. అటువంటి వ్యక్తికి ఎందుకు అధికారం కట్టబెట్టినట్టు? అతనికి అధికారంలో ఉన్నవారికి ఉన్న సాంగత్యం ఏమిటి? ఉన్నట్టుండి ఆర్.జి. కర్ ఆసుపత్రిలో పనిచేస్తున్నవారితో సహా 43 మంది డాక్టర్లు, ప్రొఫెసర్లు బదిలీ చేయబడ్డారు. అయితే, ఈ ఉత్తర్వు కుడా వెలువడిన 24 గంటలలోనే రద్దయింది. ఒకవైపు ఆసుపత్రిలో ఈ దుశ్చర్యను గురించిన నేర పరిశోధన కొనసాగుతుండగా హఠాత్తుగా ఇటువంటి చర్యలు తీసుకోవలసిన అవసరం ఏమొచ్చింది?

ఒకవైపు హత్య జరిగింది, పునర్నిర్మాణం పేరుతో ఆ సెమినార్ గది పక్కనే ఉన్న గది గోడలు పగలగొట్టారు. నేర ప్రదేశంలో ఆనవాళ్లను తుడిపేసేందుకు నిస్సిగ్గుగా ప్రయత్నించిన హాస్పిటల్ పరిపాలనా విభాగాన్ని ఏమనాలి! నేరస్తులకు ఈ ప్రదేశంలో ఏదయినా సంబంధం ఉందేమోననే అనుమానానికి ఈ చర్య ఊతం ఇస్తున్నది. దీనికితోడు ఒక వైపు న్యాయం కోసం వేలాది డాక్టర్లు నిరసన తెలుపుతుండగానే, వందలాది గూండాలు హాస్పిటల్ లోపలికి దూసుకుపోయి హాస్పిటల్ విధ్వంసానికి పాల్పడడం నేరస్తుల బరితెగింపును తెలియచేస్తుంది. వారు అంతటితో ఆగలేదు. మూకుమ్మడిగా నిరసనలు తెలుపుతున్న డాక్టర్లను భయభ్రాంతులకు గురిచేశారు. ఇంత జరుగుతున్నా కోల్‌కతా పోలీసులు చోద్యం చూశారే తప్ప ఎలాంటి చర్యా తీసుకోలేదు. పోలీసుల స్తబ్దత మీడియాలో చూస్తున్న వారినందరిని భయపెట్టింది. ఆగస్టు 14వ తేదీ, దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న వారందరి అనుభవం ఇదే. సాక్ష్యాలను తుడిచేయాలని చేసిన ప్రయత్నమిదని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఈ నేరస్తులు తామనుకున్నది సాధించడానికి, తమను తాము రక్షించుకోడానికి, ఏ చట్టాన్ని లెక్కచేయలేదు. ఏ న్యాయాన్ని అయినా తుంగలో తొక్కడానికి, ఏ వ్యవస్థ నయినా వినియోగించుకోడానికి వెనుకాడలేదని స్పష్టమవుతున్నది. వారికి రాజకీయ అండ ఉందన్న అహం, వారి నరనరాన జీర్ణించుకుపోయింది. వారి మాటే శాసనం. టి.ఎం.సి రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని, ఆసుపత్రి నిర్వాహకులను అనుమానించాల్సి వస్తున్నది. వారు చేసిన ప్రకటనలు ఒకదానితో ఒకటి పొంతన లేకుండా ఉన్నాయి. వార్తాపత్రికలలో ఆందోళన కలిగించే అంశాలు వస్తున్నాయి. అక్కడ మత్తు పదార్థాల వ్యాపారం జరుగుతున్నదని ఒకరంటే, సెక్స్ రాకెట్లు నడుస్తున్నాయని ఒకరంటున్నారు. కొంతమంది పోర్నోగ్రఫీ వ్యాపారం జరుగుతోందంటున్నారు. హాస్పిటల్ లోని మందులు, యంత్రాలు, అమ్ముకుంటున్నారని కొంతమంది ఆరోపిస్తున్నారు. పేద ప్రజలకు అందించవలసిన మందులు అమ్మకానికి పోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు మందులు కొనుక్కునే పరిస్థితి వస్తున్నది. పైగా ఆసుపత్రులలో చేరాలంటే దళారులను 'సంతోష' పెట్టాల్సిందే. అయినా పేదలకు అందుబాటులో మంచి వైద్యం మరెక్కడా లేనే లేదు. ఈ కేసులో ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు ఉదయిస్తూనే ఉన్నాయి. అసలింతకీ నేరం జరిగిన వెంటనే, వాసన పసిగట్టి నేరగాళ్ళను పట్టిచ్చే కుక్కల సేవలు వినియోగించుకోకుండా, మూడు రోజులు ఎందుకు జాప్యం చేసినట్టు? హాస్పిటల్ యాజమాన్యం నేరం జరిగిన గదికి ఆనుకుని ఉన్న గోడను ఎందుకు పడగొట్టేసింది? అసలింతకీ బాధితది ఆత్మహత్య అని ప్రచారం మొదలెట్టింది ఎవరు? నిజానికి ఇవన్నీ ప్రశ్నలుగానే ఉన్నాయి ఇప్పటికి.

> **టి.ఎం.సి రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని, ఆసుపత్రి నిర్వాహకులను అనుమానించాల్సి వస్తున్నది. వారు చేసిన ప్రకటనలు ఒకదానితో ఒకటి పొంతన లేకుండా ఉన్నాయి. వార్తాపత్రికలలో ఆందోళన కలిగించే అంశాలు వస్తున్నాయి. అక్కడ మత్తు పదార్థాల వ్యాపారం జరుగుతున్నదని ఒకరంటే, సెక్స్ రాకెట్లు నడుస్తున్నాయని ఒకరంటున్నారు. కొంతమంది పోర్నోగ్రఫీ వ్యాపారం జరుగుతోందంటున్నారు. హాస్పిటల్ లోని మందులు, యంత్రాలు, అమ్ముకుంటున్నారని కొంతమంది ఆరోపిస్తున్నారు. పేద ప్రజలకు అందించవలసిన మందులు అమ్మకానికి పోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు మందులు కొనుక్కునే పరిస్థితి వస్తున్నది. పైగా ఆసుపత్రులలో చేరాలంటే దళారులను 'సంతోష' పెట్టాల్సిందే. అయినా పేదలకు అందుబాటులో మంచి వైద్యం మరెక్కడా లేనే లేదు. ఈ కేసులో ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు ఉదయిస్తూనే ఉన్నాయి.**

టి.ఎం.సి పాలనలోని బెంగాల్‌లో గాని, బిజెపి పాలనలోని ఉత్తర ప్రదేశ్‌లోగాని రాష్ట్ర ప్రభుత్వాలు నేరస్తులకు అండగా నిలబడుతు న్నాయి. 2012 ఫిబ్రవరి 6వ తేదీన పార్క్ స్ట్రీట్లో అయిదుగురు పురుషులు ఒక మహిళపై అత్యాచారం చేశారు. ఇది పార్క్ స్ట్రీట్ కేస్‌గా గుర్తింపు పొందింది. ఆ సంఘటన గురించి చెప్పినప్పుడు ఆమె అబద్ధమాడుతోందని,తన ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూసే ప్రయత్నమని మమతా బెనర్జీ నిందించారు. అయినా ఆమె తన పోరాటాన్ని కొనసాగించి, నేరస్తులకు శిక్షలు పడేటట్టు చేసింది. ఆమె ఆ తరువాతి కాలంలో మహిళల హక్కుల ఉద్యమకారిణిగా మారింది. రేప్ బాధితులకి అండగా ప్రచారం చేసింది. 2015లో ఆ పోరాట యోధురాలు చివరి శ్వాస విడిచేవరకు బాధిత మహిళల పక్షానే నిలబడింది.

బిజెపి పాలనలో వున్న ఉత్తర ప్రదేశ్ లోని హత్రాస్, ఉన్నావ్ లలో దళిత మహిళలపై అత్యంత కిరాతకంగా జరిగిన రేప్, హత్యలయితేనేం, బిజెపి, ఆర్.ఎస్.ఎస్ కి సంబంధించిన కథువా రేప్ హత్య కేసులలో అయితేనేం, వివరాలు పూర్తిగా నమోదు చేయబడ్డాయి. రామ్ రహీమ్ 2017లో ఇద్దరు మహిళలను రేప్ చేసినందుకు శిక్ష పడింది. అయితనేం. అతనికి ఏడాదిలో 235 రోజుల పాటు పెరోల్ లభించింది. మన 77వ స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందు కూడా పంజాబ్, హర్యానా కోర్టు అతనికి పెరోల్ మంజూరు చేసింది. బిల్కిస్ బానో కేసులో శిక్ష పడిన వారిని క్షమించి విడుదల చేశారు. అయితే సుప్రీంకోర్టు జోక్యంతో తిరిగి వారిని అదుపులోకి తీసుకున్నారన్నది వేరే విషయం. 77 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా ఆడవాళ్ళకి న్యాయం అందనంత దూరంలో నిలబడి పోయింది. సిబిఐ వెంటనే సమగ్రంగా పరిశోధన చేసి నిందితులను అదుపులోకి తీసుకోవాలి. కోల్‌కతా పోలీసులు తమ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకు సంజాయిషీ ఇచ్చుకోవాలి. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలి. హాస్పిటల్‌ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. సాక్ష్యాలను రూపుమాపే ప్రయత్నంపై సమగ్ర సంపూర్ణ విచారణ జరపాలి. నిందితులను చట్టప్రకారం శిక్షించాలి. పని ప్రాంతాలలో మహిళలపై లైంగిక దాడి నివారించేందుకు, మహిళలకు రక్షణ కల్పించేందుకు, బాధితులను ఆదుకునేందుకు ఆర్.జి.కార్ ఆసుపత్రి వెంటనే చర్యలు చేపట్టాలి. డాక్టర్లకు అవసరమైన కనీస సదుపాయాలు, బాత్‌రూంలు, విశ్రాంతి గదులు, వసతులు కల్పించాలి.

పెట్టుబడిదారీ విధానం, వినిమయతత్వం, పితృస్వామ్యం, మనువాదం గొప్పదనం చాటి చెప్పడం, మహిళలు మగవారికి అణగిమణిగి ఉండాలన్న భావాలను ప్రచారం చేయడం, సమాన హక్కులు నిరాకరించడం, మహిళా హక్కుల కార్యకర్తలను చులకనగా చూడడం, నేరస్తులకు రక్షణ కల్పించడం, మతం పేరు మీద, కులం పేరు మీద అన్నిరకాల హింసలను ప్రోత్సహించడం మారాలి. ఇవి సమాజాన్ని మొద్దుబారుస్తాయి. అది పౌరులందరికీ నష్టం కలిగిస్తుంది. భారతదేశంలో కుళ్లిపోతున్న ఈ వ్యవస్థని అందరం కలిసి మూలలకంటా పెకిలించేయాలి. సమానత్వం, సమన్యాయం ఇవ్వగల సమాజాన్ని నిర్మించుకోవాలి.

**(రచయిత ఐద్వా ప్రధాన కార్యదర్శి)**

# ఆస్పత్రుల్లో ఘోర కలి నివారించాలంటే...

## కనీస భద్రత, సదుపాయాలు కల్పించాలి

కోల్‌కతా అభయ ఘటనతో విధి నిర్వహణలో తమకు భద్రత కల్పించాలంటూ రెసిడెంట్ డాక్టర్లు (హౌస్ సర్జన్లు) దేశవ్యాప్తంగా ఉద్యమించారు. ఆగష్టు 9న కోల్‌కతా ఆర్.కె. కర్ మెడికల్ కాలేజీలో యువ వైద్యురాలిపై ఘోర అత్యాచారం, హత్య వారి మనసును తీవ్రంగా గాయపరిచాయి. ఆస్పత్రి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఈ దారుణాన్ని తగ్గించి చూపేందుకు ప్రయత్నించడం వారిలో కోపాన్ని రెట్టింపు చేసింది. దీనికి తోడు వైద్యసేవలో పనిచేసేవారి రక్షణకు కేంద్ర చట్టాలేమీ లేకపోవడం వారిని మరింత ఆగ్రహానికి గురిచేసింది.





ఆరోగ్యసేవలందించే వారిపై హింసాకాండ భారత దేశంలో కొత్తేమీ కాదు. 1973లో ముంబయిలో కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న అరుణా రామచంద్ర అనే నర్సుపై ఒక స్వీపర్ బలాత్కారం చేశాడు. ఆ దుర్మార్గంతో 45 ఏళ్లు జీవచ్ఛవంగా మారిన ఆమె 2015లో ప్రాణాలు వదిలారు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా డాక్టర్లు ఇతర వైద్య సేవా ఉద్యోగులు ఆస్పత్రులలో కనీస భద్రతా చర్యల కోసం పోరాడాల్సిన పరిస్థితిలోనే వున్నారు. సరైన వెలుతురు నిచ్చే లైట్లు, మెరుగైన భద్రత, బాగా పనిచేసే కెమెరాలు కోరుతున్నారు.



**బిందు షాజన్ పరప్పదన్**

**వెలుతురు..భద్రత లేకుండా..**

మెడికల్ కాలేజీల కారిడార్లు చాలా సార్లు సరైన వెలుతురు లేకుండా మసక మసగ్గా వుంటాయంటున్నారు ఢిల్లీలో నిరసన తెల్పుతున్న వైద్యసిబ్బంది. వార్డులలో అసలు భద్రత అంతంత మాత్రం. ఆస్పత్రులలో వివిధ డిపార్టుమెంట్ల మధ్య దూరం చాలా ఎక్కువగా వుంటుంది. ఆ పని పరిస్థితులను తక్షణం మెరుగు పర్చాలంటున్నారు డాక్టర్లు. తగినంత వెలుతురు వచ్చేలా వుండాలి. సెక్యూరిటీ గార్డులను నియమించాలి. కెమరాలు అమర్చాలి. డిపార్టుమెంట్ల మధ్య ఆపరేషన్ థియేటర్ల మధ్య అలాగే ఎమర్జన్సీ (అత్యవసర) విభాగాల మధ్య సరైన రాకపోక సదుపాయాలు, కాపలా కూడా వుండాలి. ఇవన్నీ నిజంగా ఏర్పాటు చేస్తేనే ఏమైనా మార్పు అంటూ రావడం సాధ్యం."మేమెప్పటి నుంచో పదేపదే పని ప్రదేశంలో భద్రత పెంచాలని కోరుతూనే వున్నాం. ఈ దారుణ ఘటన కనువిప్పు కలిగించే ఒక హెచ్చరిక లాంటిది. డాక్టర్లు మరీ ముఖ్యంగా రాత్రి షిఫ్టుల్లో పనిచేసే జూనియర్ డాక్టర్లు, నర్సులు స్త్రీలైనా పురుషులైనా భయంతోనే వుంటారు. కేవలం శారీరకంగానే గాక మానసికంగానూ ఒత్తిడిలో వుంటారు. వారి భద్రతా విషయాలు ప్రాణాల రక్షణ మానసిక స్థితి గురించిన ఆందోళన పెరుగుతున్నది" అంటారు ఫోర్టిస్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ మాత్రమే గాక న్యూరాలజీ చీఫ్ డా. ప్రవీణ్ గుప్తా.

ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా చూడాలంటే తక్షణం వ్యవస్థలో సంస్కరణలు చేయాలంటారు నర్చర్ క్లినిక్ గైనకాలజిస్ట్ అర్చనా ధావన్ బజాజ్. "దేశ వ్యాపితంగానే జూనియర్ డాక్టర్ల పనిపరిస్థితులు మెరుగు పర్చాల్సిన అవసరముంది. ఆరోగ్య రంగంలో పని చేసే వారిపై హింసాకాండ అనేది ప్రపంచ వ్యాపిత సమస్య. అయితే చాలా దేశాల్లో సమర్థవంతమైన చర్యలు చేపట్టి వైద్య వృత్తిలో వారికి రక్షణ కల్పించారు. అవి మన భారత దేశం పాటించదగిన ఉదాహరణలుగా వున్నాయి. బ్రిటన్‌లో అయితే నేషనల్ హెల్త్ సర్వీస్ సంస్థ వైద్య వృత్తిలో వారిపై హింస విషయంలో ఏ మాత్రం సహించకుండా చర్యలు తీసుకోవాలనే విధానం పాటిస్తుంది.

**విమానాశ్రయాల స్థాయిలో భద్రత**

ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) చెప్పేప్రకారం చూస్తే వైద్యశాలల్లో డాక్టర్లపై హింస సమస్యగా వుందనే వాస్తవాన్ని అంగీకరించడంలోనే విధానపరమైన విముఖత కనిపిస్తుంది. ముందు ఈ పరిస్థితి మారాలన్నది వారి అభ్యర్థన. ఆ మేరకు ఐఎంఎ కేంద్ర ప్రభుత్వానికి ఒక కోర్కెల పత్రం సమర్పించింది.ఒక విమానాశ్రయంలో ఎంత భద్రత వుంటుందో వైద్య కేంద్రాలలోనూ అంతే భద్రత వుండేలా నిబంధనలు విధించాలన్నది వారి డిమాండు. వైద్యశాలలను భద్రతా ప్రదేశాలుగా (సేఫ్ జోన్స్)గా ప్రకటించాలి. సి.సి టీవీలు, భద్రతా సిబ్బంది నియామకం జరగాలి. "ఈ ఘటనలో బలైన డాక్టర్ 36 గంటల పాటు డ్యూటీలోనే వుంది. కాస్త విశ్రాంతి తీసుకోవడానికి సురక్షితమైన స్థలమంటూ లేదు. రెసిడెంట్ డాక్టర్లకు సంబంధించిన ఈ పని పరిస్థితులు జీవిత పరిస్థితులూ పూర్తిగా మార్చవలసి వుంది." అని కోరింది ఐఎంఎ.

అంతేగాక జరిగిన ఈ ఘోరంపై చాలా సునిశితంగానూ వృత్తి నైపుణ్యంతోనూ దర్యాప్తు జరపాలని ఐఎంఎ జాతీయ అధ్యక్షుడు ఆర్‌వి అశోకన్ కోరుతున్నారు. దీనిపై నిర్దిష్ట కాల వ్యవధిలో చర్య తీసుకుని న్యాయం జరిగేలా చూడాలన్నారు. "ఆ దుండగులెవరో కచ్చితంగా గుర్తించాలి. ఆ దౌర్జన్యం చేసిన వారిని బయటపెట్టాలి. వారికి గుర్తుండి పోయేలా తీవ్రమైన శిక్ష విధించాలి. ఘోరంగా బలైన ఆ కుటుంబానికి సముచితమైన గౌరవ ప్రదమైన పరిహారం అందాలని ఆయన కోరారు. ఈ దురంతం జరిగిన తర్వాత వారం రోజులకు ఆగష్టు 16న కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ఉత్తర్వు విడుదల చేస్తూ ఆస్పత్రుల బాధ్యులకు ఆదేశాలిచ్చింది. విధి నిర్వహణలోని వైద్యరంగ సిబ్బందిపై ఏదైనా హింసాత్మక ఘటన జరిగితే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆ సంస్థ అధినేత బాధ్యత వహించవలసి వుంటుంది. ఘటన జరిగిన ఆరు గంటల్లోగా ఈ ఫిర్యాదు నమోదు కావాలని పేర్కొంది. ప్రత్యేకించి ప్రభుత్వ ఆస్పత్రులలో డాక్టర్లపై హింసాకాండ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఉత్తర్వు అవసరమైంది. విధి నిర్వహణలో వుండగానే అనేకమంది వైద్య సిబ్బంది హింసాకాండకు గురవుతున్నారు. రోగి లేదా రోగి దగ్గర వున్న సహాయకులు ఇందుకు పాల్పడుతున్నారని ఆ ఉత్తర్వు పేర్కొంది (అయితే కోల్‌కతా ఘటన పూర్తి భిన్నమైంది). దీంతోపాటే నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) కూడా ఒక ఆదేశమిస్తూ వైద్య కళాశాలన్నీ భద్రతా విషయాలకు సంబంధించి ఒక విధానం రూపొందించాలని ఆదేశించింది.





**/ రచయిత హిందూ జర్నలిస్టు /**

# కోల్‌కతా కర్కశం...

**9.8.24** 36 గంటలు డ్యూటీ చేసిన ట్రైనీ వైద్యురాలు ఆ రోజు రాత్రి 2 గంటల నుంచి 3 గంటల మధ్యలో చదువు కునేందుకు సెమినార్ హాల్‌కు వెళ్లింది. అలసిపోయిన ఆమె అక్కడే నిద్రపోతున్న సమయంలో ఆమెపై సామూహిక అత్యాచారం చేసి, ఆపై దారుణంగా హత్య చేశారు. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ మెడికల్ కళాశాలలో శుక్రవారం వేకువ జామున 3 గంటలనుంచి 5 గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది.

డ్యూటీలో ఉన్న వైద్యురాలు హత్యకు గురైన విషయాన్ని ఉదయం 11 గంటలకు వరకు సిబ్బందికానీ, ఆసుపత్రిలో ఉన్నవారుకానీ గుర్తించలేదు. అదీ ఆమెను ఇంటికి తీసుకెళ్లడానికి డ్రైవర్ ఆసుపత్రికి వచ్చే వరకూ ఎవరూ గుర్తించలేదు.

మొదట ఇది ఆత్మహత్య అని తర్వాత రేప్, హత్య అని పోలీసులు తల్లిదండ్రులకు చెప్పారు. వారిని 3 గంటలకుపైగా ఆసుపత్రి బయటే నిలబెట్టారు. మృతదేహం దగ్గరికి పోనీయలేదు. పైగా వెంటనే అంత్యక్రియలు పూర్తి చేయించేలా ఒత్తిడి తెచ్చారు. పోలీసులు సరైన కోణంలో విచారణ జరపలేదని ఆగమేఘాలమీద అంత్యక్రియలు పూర్తి చేయించారని బాధితురాలి తండ్రి ఆరోపించారు.

అదే రోజు రాత్రి రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది.

**10.8.24** ఈ ఘటనకు సంబంధించి ట్రైనీ వైద్యురాలు హత్యకు గురైన సెమినార్ హాల్‌లో పడిఉన్న బ్లూటూత్ ఆధారంగా సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేసి 14 రోజుల కస్టడీ విధించారు. సివిక్ పోలీసు వాలంటీర్‌గా సంజయ్‌రాయ్ పనిచేస్తున్నాడని, ఈ నేపథ్యంలోనే రోగులను ఆసుపత్రిలో చేర్చడానికి తరచూ వచ్చేవాడని, గురువారం రాత్రి కూడా ఆసుపత్రిలో సంజయ్ సంచరించినట్లు పోలీసులు గుర్తించారు.

**12.8.24** ఆర్‌జికార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. మృతురాలు తన కుమార్తె వంటిదని, ఒక తండ్రిగా ఆ బాధ తనకు తెలుసునని, అందువల్లే తన పదవికి రాజీనామా చేస్తున్నానని డాక్టర్ సందీప్ ఘోష్ విలేకర్లకు వెల్లడించారు. మరోవైపు ఐదురోజులైనా ప్రిన్సిపాల్ కానీ, పాలకవర్గం కానీ ఈ ఉదంతంలో ఫిర్యాదు దాఖలు చేయలేదనే ఆరోపణలున్నాయి. కనీసం వారిని పిలిచి ప్రశ్నించినవారూ లేకపోవడం గమనార్హం.

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో నిందుతులను కఠినంగా శిక్షించాలని మృతురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎఫ్ఒఆర్‌డిఎ) దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టింది. సిఎం మమతా బెనర్జీ బాదితురాలి కుటుంబ సభ్యులను కలిసి రూ.10 లక్షల పరిహారం ప్రకటించడంతో న్యాయానికి బదులుగా పరిహారం ప్రకటించిన బెంగాల్ ప్రభుత్వంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. అన్ని అధికారాలు చేతిలో ఉన్నా మమత స్వయంగా నిరసనలో పాల్గొని దోషులకు మరణశిక్ష పడాలని డిమాండ్ చేస్తూ అభాసుపాలయ్యారు. రాష్ట్ర పోలీసులు ఉద్దేశపూర్వకంగానే కేసును నీరు గార్చారనే ఆరోపణలున్నాయి.




**13.8.24** ఆరురోజుల్లో కేసుపై నిగ్గుతేల్చకపోతే కేసును సిబిఐకి అప్పగిస్తానని మమత పోలీసులను హెచ్చరించారు. కానీ, అదే రోజు ఈ కేసును సిబిఐకి అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అత్యంత పాశవిక దాడి జరుగుతుంటే ఆసుపత్రిలో ఉన్నవారికి ఆ విషయం తెలియకపోవడం, యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో నిందితుడికి పోలీసులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సాక్ష్యాలు తారుమారు చేయకుండా ఉండేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని బాదితురాలి తల్లిదండ్రులు కోరినట్లు న్యాయస్థానం పేర్కొంది.

**14.8.24** ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, దర్యాప్తు అధికారులతో కూడిన సీబీఐ బృందం ఢిల్లీ నుంచి కోల్‌కత్తా చేరుకుంది.

**15.8.24** పోస్టుమార్టం నివేదిక వెలువడింది. ఈ రిపోర్టు ప్రకారం ఆమె శరీరంపై తీవ్ర గాయాలున్నాయి. పెదవులు, ముక్కు, చెంపలకు, దవడలకు, కణతతోపాటు పుర్రెకూ గాయాలున్నాయి. ఆమె శరీరంలో 150 మిల్లీగ్రాముల వరకూ వీర్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి తమ కుమార్తెపై ఒకరి కంటే ఎక్కువ మంది అత్యాచారానికి పాల్పడి ఉంటారని, ఆమెను గొంతు నులిమి చంపినట్లు స్పష్టమైన ఆధారాలున్నట్లు బాధితురాలి తల్లిదండ్రులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.సాక్ష్యాధారాలు నాశనం చేశారు.

బుధవారం అర్ధరాత్రి ఆసుపత్రి బయట సంఘీభావ ప్రదర్శనలు జరుగుతుండగా.. 40కి పైగా అల్లరిమూక హాస్పటల్‌లో విధ్వంసానికి దిగింది. ఎమర్జెన్సీ, ఔట్‌పేషెంట్స్ వార్డులు, నర్సింగ్ స్టేషన్, మెడికల్ స్టోర్‌లో పరికరాలు, ఔషధాలను చిందరవందర చేసింది. మరోవైపు యాజమాన్యం సెమినార్ హాల్లో ఆదరబాదరా మరమ్మతులు చేపట్టింది. పక్కనున్న బాత్‌రూం గోడను కూల్చేసింది. దీంతో సందేహాలు సహజంగానే తలెత్తాయి. సాక్ష్యాలు ధ్వంసం చేసేందుకు టిఎంసి గుండాలే ఈ దాడికి దిగాయని పలువురు ఆరోపించారు.

**17.8.24** భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీనికి డాక్టర్లు, విద్యార్థులు పెద్దఎత్తున స్పందించారు.

**19.8.24** ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

–మరోవైపు ఆసుపత్రుల్లో భద్రతా చర్యలు పటిష్టపరచడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని 70 మందికిపైగా పద్మ అవార్డుల గ్రహీతలైన డాక్టర్లు ప్రధాని మోడీకి లేఖ రాశారు. లేఖ రాసిన వారిలో ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ్, ఎయిమ్స్ రెసిడెంట్స్ డాక్టర్లు తదితరులు ఉన్నారు.

**20.8.24** నిందితుడు సంజయ్‌రాయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు స్థానిక కోర్టు అనుమతించింది. అతని మానసిక స్థితిని తెలుసుకోవడానికి అప్పటికే సిబిఐ సైకోఅనాలసిస్ టెస్టు చేసింది.

**22.8.24** క్రైం సీన్‌నే మార్చేశారంటూ సుప్రీం కోర్టుకు సమర్పించిన నివేదకలో సిబిఐ వెల్లడించింది. పోస్ట్‌మార్టాన్ని వీడియో తీయాల్సిందేనని వైద్య రాలి సహచరులు, సీనియర్ డాక్టర్లు పట్టుబట్టారు. లేదంటే ఆ ఆధారాలు కూడా మిగిలేవి కాదని తెలిపింది. బాదితురాలి తండ్రి డిమాండ్ చేసినా అంత్యక్రియల అనంతరం రాత్రి 11.45 గంటలకు గానీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణం అని సిబిఐ వెల్లడించింది. సాయంత్రం 6.10 నుంచి 7.10 మధ్య పోస్టుమార్టం తర్వాత గానీ క్రైం సీన్‌ను పోలీసులు అధీనంలోకి తీసుకోక పోవడాన్ని సిజెఐ ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడటం ప్రిన్సిపల్ కనీస బాధ్యత? ఆయ నెందుకు జాప్యం చేశారు? రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను ఎందుకు మరో కాలేజీకి బదిలీ చేసింది? అని సిజెఐ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, సిబిఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించి నివేదికలు సమర్పించారు.

**24.8.24** ఆర్‌జికర్ ఆసుపత్రిలో దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆద్వర్యాన కోల్‌కతా లోని కాలేజీ స్ట్రీట్ నుంచి 'లాల్ బజార్ చలో' కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో విధ్వంసంతో ఏ మాత్రం సంబంధంలేని వామపక్ష నాయకులకు పోలీసులు సమన్లు జారీ చేయడాన్ని ఖండించారు.

25.8.24 కాలేజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు, ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు సిబిఐ లై డిటెక్టర్ పరీక్ష (సత్యశోధన పరీక్ష) నిర్వహించింది. అదే కాలేజీకి చెందిన మొత్తం ఐదుగురికి ఈ పరీక్ష నిర్వహించింది. 15 మందిని విచారించింది. విచారణలో బయటపడిన సంగతులను గోప్యంగా ఉంచింది.

ఆర్‌జికర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకల లావాదేవీలపై సిబిఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ఘోష్ నివాసంలో సిబిఐ సోదాలు నిర్వహించింది.

# వైద్య సిబ్బంది రక్షణకు తక్షణమే సమగ్ర చట్టం

## సిపిఎం డిమాండ్

వైద్య సిబ్బంది రక్షణకు తక్షణమే ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సిపిఎం డిమాండ్ చేసింది. పార్టీ పొలిట్‌బ్యూరో సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. కోల్‌కతాలోని ఆర్‌జి.కర్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై అత్యంత దుర్మార్గంగా అత్యాచారం, అనంతరం హత్య చేయడంపై దేశవ్యాప్తంగా డాక్టర్లు ముఖ్యంగా జూనియర్ డాక్టర్ల నుంచి నిరసనలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆందోళనలు, నిరసనలు చూస్తుంటే యువ మహిళా బాధితురాలికి సంఘీభావం తెలియచేయడమే కాకుండా డాక్టర్లు ఎంత అభద్రతా వాతావరణంలో, ఏ మాత్రం సురక్షితంగా లేని పరిస్థితుల్లో పనిచేస్తున్నారో వెల్లడవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. వైద్య సిబ్బంది నిరసనలు, ఆందోళనలకు ప్రజా మద్దతు పెద్దయెత్తున లభిస్తోంది. వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌పై అత్యవసరంగా స్పందించడానికి బదులు మోడీ ప్రభుత్వం ఈ విషయంపై విచారణకు కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం దురదృష్టకరమని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. వైద్య వర్గాలతో చర్చలు, సంప్రదింపులు జరిపి ఇంకెంత మాత్రం జాప్యం చేయకుండా చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరింది. ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్నా, తగు చట్టం తీసుకురావడమనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంశమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంత వరకు, న్యాయ ప్రక్రియను ధ్వంసం చేసేందుకు యత్నిస్తున్నట్లు రోజుకో కొత్త ఆధారం బయటకొస్తున్నదని, దీనిపై ధైర్యం చేసి ప్రశ్నించినవారిని బెదిరిస్తున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ముఖ్యమంత్రి పట్ల, ప్రభుత్వం పట్ల తమకు ఎలాంటి నమ్మకం లేదని బాధితురాలి తండ్రి ప్రకటించారని, ప్రజలు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేయడం చూస్తుంటే ప్రతి దశలోనూ నిజాలను బయటకు రాకుండా తొక్కిపట్టేందుకు ఎలా ప్రయత్నిస్తున్నదీ తేటతెల్లమవుతోందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ఈ రీత్యా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చట్టాన్ని తీసుకురావాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. వాస్తవాలను మరుగుపరచి, ఇంతటి కిరాతకానికి పాల్పడినవారిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెరచాటునుంచి చేస్తున్న యత్నాలను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. బాధితురాలికి, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేసింది.

# లైంగిక వేధింపులంటే...!



> పని ప్రదేశంలో ఏదైనా అయిష్టపూర్వకమైన, చిరాకు కలిగించే దురుసు ప్రవర్తన మొదలుకొని అత్యంత తీవ్రమైన లైంగిక దుర్వినియోగం, దాడి, అత్యాచారం వరకూ లైంగిక వేధింపుల కిందకే వస్తాయనిఅంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ) పేర్కొంది.

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నిరోధం, నిషేధం, పరిహారం) చట్టం 2013, ప్రకారం కింద పేర్కొన్న అయిష్టపూర్వకమైన చర్యలు, ప్రవర్తనను లైంగిక వేధింపులుగా నిర్వచించారు.

– శారీరక స్పర్శ, అవాంఛిత జోక్యం. – లైంగిక కోర్కె తీర్చమనే ఒత్తిడి లేదా అభ్యర్థన.– లైంగికపరమైన వ్యాఖ్యలు చేయడం.– బూతు చిత్రాలను చూపించడం.– శారీరక, లైంగిక మాటలు లేదా సైగలతో కూడిన ప్రవర్తన.

లైంగిక ధోరణులతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆమెకు ఉద్యోగంలో ప్రత్యేకమైన హోదా ఇస్తాననడం. – ఉద్యోగానికి సంబంధించి వినాశకరమైన పరిణామాలు ఉంటాయని బెదిరించడం. –ఆమె ప్రస్తుత, భావి ఉద్యోగ హోదాకు సంబంధించి బెదిరించడం. – ఆమె పనిలో జోక్యం చేసుకోవడం. వ్యతిరేకత, విరోధపూరిత, ఒత్తిడి పెంచే పని వాతావరణం కల్పించడం. – ఆమె ఆరోగ్యం లేదా భద్రతపై ప్రభావం కలిగించేలా కించపరచడం కూడా లైంగిక వేధింపుల కిందకే వస్తాయి.

### గుర్తించడం ఎలా?

అనేక మంది మహిళలు లైంగిక వేధింపుల్ని గుర్తించడంలో విఫలమవుతుంటారు. వాటిని చిన్న విషయాలు గానూ, సాధారణమైనవి గానూ భావిస్తుంటారు. పైన పేర్కొన్నవాటిలో చాలా వాటికి మీరు అవును అన్న సమాధానం వచ్చినట్లయితే, మీ పని వాతావరణంలో లైంగిక వేధింపులు ఉన్నట్లే. మీకింకా సందేహం ఉన్నట్లైతే మీకు నమ్మకమైన సహోద్యోగితో చర్చించండి. మౌనంగా ఉండిపోకండి.

### ఏం చేయాలి?

ఒకవేళ మీరు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లయితే వాటిని ఆపటానికి తగిన చర్యలు తీసుకోండి. ఆ సమయంలో మాట్లాడాలి. ఎప్పుడైనా లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నప్పుడు, స్థిరంగా 'వద్దు' చెప్పడం మరవకండి. మిమ్మల్ని వేధించే వ్యక్తి ప్రవర్తన అసభ్యకరంగా ఉందని తెలియజేసేందుకు అదే సరైన మార్గం. మిమ్మల్ని ఏదైనా ప్రదేశానికి రమ్మని, కొన్ని పనులు చేయమని, ప్రశ్నలకు సమాధానమివ్వమని అడిగినప్పుడు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ కింద ఇచ్చిన కొన్ని విషయాలను పరిశీలించండి.

### గమనించదగ్గ విషయాలు

మీకు కొందరు సూపర్ వైజర్లు, సహోద్యోగులతో కలిసి పని చెయ్యడం ఇష్టం లేకపోవడం. ఎవరో మీ వంక తదేకంగా చూస్తున్నట్లు అనిపించడం. పని చేస్తున్న చోట స్త్రీ పురుష సంఖ్యలో సమ తూకం లేకపోవడం. కొన్ని సమయాల్లో సూపర్‌వైజర్లు, సహోద్యోగులు మిమ్మల్ని స్పృశించడం.

మీరు పని చేసే ప్రదేశంలో కొన్ని సంఘటనలు జరిగినప్పటికే వాటిని సహనంతో భరిస్తుండడం. మీ సూపర్‌వైజరు మిమ్మల్ని అప్పుడప్పుడు డిన్నర్‌కు పిలుస్తుండడం. మీ ఉద్యోగం పోగొట్టుకోవడం ఇష్టం లేనందువల్ల, మీ సూపర్‌వైజర్ ఏం చెప్పినా విధేయత చూపాల్సి రావడం. మీ వేషధారణ గురించి అప్పుడప్పుడు పరిహాసాలు, వ్యాఖ్యలు వస్తుంటాయి. మీ సూపర్‌వైజర్ తరచుగా మీ వ్యక్తిగత జీవితం గురించి అడుగుతుంటాడు. మీ సహోద్యోగి / సూపర్‌వైజర్ నుండి తరచు మీకు పనితో సంబంధం లేని ఈ–మెయిళ్లు వస్తుంటాయి.

మీకు ఇబ్బందికరమైన పరిస్థితులు కల్పించినప్పుడు స్పష్టంగా, స్థిరంగా "వద్దు" అని చెప్పండి. అవతలి వ్యక్తి భావాలను గాయపరచినందుకు బాధపడకూడదు. అటువంటి ప్రవర్తనకు అభ్యంతరం చెప్పడమనేది ఆ తర్వాత ఫిర్యాదు చేసినపుడు సహాయకారిగా ఉంటుంది.

### రికార్డు చేయడం

సంఘటనలను జరిగినది జరిగినట్టుగా క్రమంలో ఒక డైరీగా రాయాలి. మీరు రిసీవ్ చేసుకుంటున్న ఉత్తరాలు, నోట్స్, ఇతర డాక్యుమెంట్లు వంటి వాటిని భద్రపరచాలి. తేదీలను, సమయాలను (అయిష్టపూర్వక సందర్భాల ఘటనలను) రాసిపెట్టుకోవాలి. అప్పుడు ఎవరైనా సాక్షులు ఉన్నట్లైతే వారి పేర్లనూ రాసి ఉంచాలి.

### నేర విచారణ సమయంలో

మీరు విచారణకు ఉపయోగించే ప్రతి డాక్యుమెంటునూ సాక్ష్యంతో బలపరచాలి. మీ వాంగ్మూలాల సమయంలో మీరు ఆ డాక్యుమెంటు ఎక్కడి నుండి సంపాదించారని డిఫెన్సు న్యాయవాది ప్రశ్నించవచ్చన్న విషయం దృష్టిలో ఉంచుకోవాలి. మీరు ఆ డాక్యుమెంటును ఎక్కడ నుండి సంపాదించారో, ఎవరు దాన్ని బలపరుస్తారో స్పష్టపరచలేనపుడు, మీరు ఆ డాక్యుమెంటును విచారణలో ఉపయోగించలేరు.

అన్ని ప్రశంసా ఉత్తరాలను, థ్యాంక్యూ కార్డులను, మీ పనితీరును బలపరిచే ఏ విషయాన్నైనా తీసుకు వెళ్లండి. మిమ్మల్ని, మీ పనితనాన్ని ప్రశంసిస్తూ మీ అధికారులు ఇచ్చిన డాక్యుమెంట్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి. వీలైతే, మీ వినియోగదారులను, సిబ్బందిని, సమాన హోదా కల వ్యక్తుల్ని ప్రశంసాపూర్వక ఉత్తరాలు ఇవ్వమని అడగండి.

### నమ్మకస్తులతో మాట్లాడడం

లైంగిక వేధింపుల గురించి మౌనంగా లేక నిర్లిప్తంగా ఉండడం దానిని కొనసాగనిచ్చినట్లు అవుతుంది. ఇతర సహోద్యోగులతోనూ, కుటుంబ సభ్యులతోను లేక స్నేహితులతోను మాట్లాడండి. ఆ వ్యక్తి వేధింపులకు గురయ్యే వారు మీరొక్కరే కాకపోవచ్చు.

### ఒక సాక్ష్యాన్ని సృష్టించడం

మీకు బాగా నమ్మకస్తులైన సహోద్యోగికి తెలియజేయండి. ఆ వ్యక్తిని లైంగిక వేధింపులను చూసిన, విన్న సాక్షిగా ఉండేలా చూడండి. అధికారికంగా ఫిర్యాదు నమోదు చేయాలనుకున్నపుడు ఇది ఉపయోగపడుతుంది.

సంస్థలో తగిన హోదాలో ఉన్న వారికి మీరు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను గురించి ఫిర్యాదు చెయ్యండి.

### ఫిర్యాదు నమోదు

ఇందుకు గాను మీకు వున్న అవకాశాలను పరిశీలించండి. ఒక ఫిర్యాదును నమోదు చెయ్యండి. మీ సంస్థలో అటువంటి విధానం లేనట్లైతే, మీ యజమాని ఒక లైంగిక వేధింపుల నిరోధక విధానాన్ని రూపొందించుడానికి అన్ని చర్యలు తీసుకునేలా చూడండి.

### వైద్య పరీక్షకు వెళ్లండి

ఒకవేళ మీపై అత్యాచారం జరిగినా లేక శారీరకంగా దాడిని ఎదుర్కొన్నా, వెంటనే వైద్య పరీక్షకు వెళ్లి, మెడికల్ రిపోర్టును తీసుకోండి. లీగల్ కేసును వెయ్యడానికి మీరు నిర్ణయించుకున్నప్పుడు, ఇది ముఖ్యపాత్ర వహిస్తుంది.

### సివిల్ వ్యాజ్యం

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు జరిగినపుడు బాధితులు సివిల్ వ్యాజ్యం వేయవచ్చా? అంటే వేయవచ్చు. నష్టపరిహారాల చట్టం కింద సివిల్ వ్యాజ్యం వెయ్యవచ్చు. లైంగిక వేధింపుల వల్ల మానసిక క్షోభ, శారీరక వేధింపులు, ఆదాయానికి, ఉద్యోగానికి హాని కలిగాయన్న అంశాల ఆధారంగా కేసును ఫైల్ చేయవచ్చు.

### ఫిర్యాదును ఎక్కడ ఫైల్ చేయవచ్చు?

అంతర్గత ఫిర్యాదుల కమిటీ స్థానిక ఫిర్యాదుల కమిటీలో కేసు ఫైల్ చేయొచ్చు. 20 మంది కన్నా తక్కువ పని వారున్నందువల్ల మీరు పని చేసే చోట ఫిర్యాదులు కమిటీ లేకపోతే లేదా ఆ ఫిర్యాదు మీరు పని చేసే సంస్థ యజమానిపైనే అయినపుడు, కేసు విషయంలో రాజీ జరుగుతుందని భావించినపుడు స్థానిక ఫిర్యాదుల కమిటీ దగ్గర కేసు నమోదు చేయవచ్చు.

కొన్నిసార్లు స్థానిక ఫిర్యాదుల కమిటీ వెంటనే అందుబాటులో లేనపుడు, ఈ చట్టం ప్రకారం జిల్లా అధికారి లేదా ప్రతి బ్లాకు, తాలుకా, తహసీల్ వంటి గ్రామీణ ప్రాంతాల్లో, వార్డు లేదా మున్సిపాలిటీ వంటి పట్టణ ప్రాంతాల్లో నియమితులైన ఒక నోడల్ అధికారి ఫిర్యాదును స్వీకరించి, స్థానిక ఫిర్యాదుల కమిటీకి ఏడు రోజుల లోపుగా పంపించాలని చట్టం సూచించింది.

## ప్రభుత్వం కదలాలి



వైద్యుల రక్షణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. కొల్‌కతా ఘటనకు నిరసనగా రాష్ట్రంలో 15 రోజులుగా వైద్యులు ఆందోళన నిర్వహిస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే కర్నూలు, తిరుపతి, గుంటూరులో జూనియర్ వైద్యులపైన, సిబ్బందిపైన దాడులు జరిగాయి. ఈ విషయమై ముఖ్యమంత్రికి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రాలు సమర్పించాం. రాష్ట్రంలో వైద్యుల రక్షణకు ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఆస్పత్రిలో వైద్యులు పనిచేసేందుకు అవసరమైన కనీస వసతులు లేవు. మహిళా వైద్యులకు రాత్రివేళ ఆస్పత్రి నుంచి హాస్టల్‌కి వెళ్లేందుకు తగిన రక్షణ లేదు. జనరల్ ఆస్పత్రుల్లో నాల్గో తరగతి ఉద్యోగుల (ఎంఎన్ఒ, ఎఫ్ఎన్ఒ) సంఖ్యను రోగుల రద్దీకి అనుగుణంగా పెంచాలి. ఆస్పత్రిలో ప్రయివేట్ సెక్యూరిటీ కాకుండా ప్రభుత్వ సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. వైద్య కళాశాలల్లో పోలీసుల పర్యవేక్షణలో నిరంతర సెక్యూరిటీ ఉండాలి. రాత్రివేళ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి. సిసి టివి కెమెరాలు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి.

**– డా॥ ఎస్. అమీరన్, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

## భయం భయంగా విధి నిర్వహణ...



ప్రభుత్వాస్పత్రుల్లో మహిళా వైద్యులు రాత్రిళ్లు కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప, మిగతా సందర్భాల్లో మహిళా వైద్యులను రాత్రి సమయంలో విధులకు దూరంగా ఉంచాలి. మహిళా పోలీసులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులుగానీ, మత్తు పదార్థాలు సేవించిగానీ ఆస్పత్రిలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రత్యేక నిఘా అవసరం. మహిళా వైద్యులకు, సిబ్బందికి ఆస్పత్రిలో పూర్తి రక్షణ కల్పించాలి. భయపడుతూ విధులు నిర్వర్తించే పరిస్థితి ఉండకూడదు.

**– డా॥ బి.గీతాంజలి, పల్నాడు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి.**

## ప్రాణం పోసే వారికే భద్రత కరువు



కోల్‌కతా ఘటనను తలచుకుంటే..ఆపద సమయంలో ప్రాణాలు కాపాడే వైద్యులకు సమాజంలో దక్కుతున్న గౌరవం ఇదేనా అనిపిస్తోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో జరుగుతున్న దాడులు మహిళా వైద్యులనే కాదు...సాధారణ మహిళలను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మహిళా వైద్యులు, నర్సులు ఎక్కువగా ఉన్న ఆస్పత్రులపై పోలీసు నిఘా ఉండాలి. మహిళలపై దాడులకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించకుండా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి.

**– డా॥ సిహెచ్ రాధిప్రియా, హిమబిందు ఫెర్టిలిటీ సెంటర్, నరసరావుపేట.**

## ప్రతి ఆస్పత్రిలో భద్రత



మహిళలనే కాకుండా యావత్ దేశ ప్రజలను కదిలించిన కోల్‌కతా ఘటన తరువాత విధులకు రావాలంటేనే భయంగా ఉంది. వ్యవసాయ ఇతర పనులు చేసుకునే వారి నుంచి ఉన్నత కొలువులలో ఉన్న మహిళల వరకూ వేధింపులకు, దాడులకు గురవుతున్నారు. మహిళా వైద్యుల భద్రత కోసం ప్రతి ఆస్పత్రిలో ఇద్దరు చొప్పున కానిస్టేబుళ్లను 24 గంటలూ బందోబస్తులో ఉంచాలి. దోషులను తక్షణం శిక్షించాలి.

**– డా॥ రేవతి భాయి, పిహెచ్‌సి, వి రెడ్డిపాలెం, రొంపిచర్ల మండలం, పల్నాడు జిల్లా.**

## డాక్టరు సురక్షితంగా ఉండేలా చట్టాలు



వైద్యరంగంలో ఉన్న వారిపై దాడులను అరికట్టడానికి సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ మనుగడలోకి వచ్చేలా చేయాలి. ఇలాంటి దారుణాలు చూడవలసిన పరిస్థితిలో ఉన్నామంటే 78 ఏళ్ల స్వాతంత్రానికి అర్థం లేదు. ప్రతి డాక్టర్ సురక్షితంగా ఉండాలి. అందుకనుగుణంగా చట్టాలు ఉండాలి.

**– డా॥ వి. సాయి శ్రీజ, డాక్టర్ ॥ పి శివసంతోష్ కుమార్, ఎయిమ్స్**

## సభ్య సమాజం తలదించుకునే ఘటన



ఇటీవల కాలంలో వైద్యులపై, ఆస్పత్రులపై దాడులు పెరిగిపోతున్నాయి. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, ఆమెను అతి కిరాతకంగా హత్య చేయడం అత్యంత హేయం. ఈ అనాగరిక చర్యతో సభ్య సమాజం తల దించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన దుర్మార్గులను ప్రభుత్వం, చట్టం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. మరోచోట ఇలాంటి ఘటన పునరావతం కాకుండా కఠినంగా శిక్షించాలి. రోగి ప్రాణాన్ని కాపాడటం వైద్యుల విధి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన రోగికి చికిత్స అందించాలంటే ఆలోచించాల్సిన పరిస్థితులు, భయపడాల్సిన అగత్యం ఏర్పడింది. ప్రతి చిన్న విషయానికీ వైద్యులపై విరుచుకుపడిపోవడం, ఆసుపత్రులపై దాడులకు పాల్పడటం సర్వసాధారణమైంది. ఇలాంటి పరిణామాలను ప్రభుత్వం అరికట్టి వైద్యులకు, వారి విధి నిర్వహణకు ఆటంకం లేకుండా రక్షణ కల్పించాలి.

**– డా॥ డి. శారద, శారద సర్వీస్ సొసైటీ, తెనాలి**

## చెడు అలవాట్లపై నియంత్రణ



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై ఘటన దారుణం. ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. నేడు యువత డ్రగ్స్, మద్యం, గంజాయి వంటి వాటికి అలవాటుపడి పెడమార్గం పడుతున్నారు. ప్రభుత్వాలు ఇటువంటి వాటిని నియంత్రించడంతోపాటు యువతకు అవగాహన కల్పించాలి. డ్యూటీలో ఉన్న వైద్యులకు, ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి. హాస్పటల్ ఓపికి వచ్చే వారికి సైతం అవగాహన కల్పించాలి. పిల్లలు రోజూ పాఠశాల లేదా కాలేజికి వెళుతున్నారా? లేదా? అని గమనించడంతోపాటు వారి బ్యాగులను సైతం తల్లిదండ్రులు తనిఖీ చేయాలి. అప్పుడప్పుడైనా పాఠశాల, కళాశాలకు వెళ్లి తమ పిల్లల గురించి తెలుసుకోవాలి.

**– డా॥ ఎం. స్రవంతి, బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యులు**

## వైద్యులకు రక్షణ



ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలి. డ్యూటీ చేస్తున్న సమయంలో వైద్యులకు తగిన రక్షణ కల్పించాలి. రోజుల తరబడి విశ్రాంతి లేకుండా హాస్పటల్లో సేవలందిస్తున్న డాక్టర్లపై అఘాయిత్యాలకు పాల్పడటం శోచనీయం. తమ తల్లిదండ్రులను, కుటుంబాలను వదిలి సేవ చేసేందుకు వచ్చిన వైద్యులకు తగిన భద్రత కల్పించాలి. రాత్రి సమయాల్లోనూ సెక్యూరిటీ, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలి.

**– డా॥ జె. నాగరాణి, జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి.**

## మహిళలను గౌరవిద్దాం



చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. కఠిన చట్టాలు తీసుకొచ్చి, అఘాయిత్యాలకు పాల్పడే వారిపై పకడ్బందీగా అమలు చేసినప్పుడే ఇటువంటి సంఘటలను అరికట్టవచ్చు. మహిళల పట్ల గౌరవ మర్యాదలు చూపాలని చిన్నప్పటి నుంచే అబ్బాయిలకు అవగాహన కల్పించాలి. మహిళలు బయటికెళ్తే మళ్లీ తిరిగి క్షేమంగా వస్తారనే నమ్మకం లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితి మారాలి.

**– జుజ్జువరపు సుధారాణి, జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పటల్ స్టాఫ్ నర్స్**



# బాధితకు న్యాయం సాధ్యమేనా ?

## వైద్యులకు ప్రత్యేక రక్షణ అవసరం



శిక్ష సరిగా లేకపోవడం, భయం లేని కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. మహిళలకు రక్షణ కావాల్సిందే. అదే సమయంలో డాక్టర్లుకు ప్రత్యేక రక్షణ అవసరం. రాత్రి, పగలు తేడా లేకుండా డాక్టర్లు విధులు నిర్వహిస్తారు. పనిచేసేచోట ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. రక్షణ కోసం చర్యలు తీసుకోవాలి. రక్షణ సెల్ ఒకటి దేశ వ్యాపితంగా అమలు చేయాలి. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కఠినంగా శిక్షించాలి. పనిచేసే చోట రక్షణ ఉండాలి. పెద్ద పెద్ద ఆస్పత్రుల విభాగాల్లో కావాల్సిన ప్రత్యేక గదులు ఉండాలి. సుప్రీంకోర్టు కొల్‌కతా విషయాన్ని సుమోటోగా తీసుకోవడం మంచి పరిణామం. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలనే డిమాండ్ ఉంది. దీనిని అమలు చేయాల్సిన అవసరముంది.

**- డా॥ ఎం.వి. రమణయ్య ,ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు.**

## కరాటే వంటివి నేర్పించడం అవసరం



పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి. ఏదైనా అవాంఛనీయ పరిస్థితి ఎదురైతే వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన శిక్షణను మహిళలకు ఉచితంగా అందించాలి. పాఠశాల స్థాయి నుంచే కరాటే వంటివి నేర్పించి, అత్యవసర సమయాల్లో తమను తాము ఎలా కాపాడుకోవాలో నేర్పించాలి.

**- అంబోజి మనస్విత, నర్సింగ్ విద్యార్థిని.**

## ప్రత్యేక చట్టం రావాలి

వైద్యులు, వైద్య సిబ్బందిపై తరచుగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దోషులను శిక్షించడంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దోషులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని ఎ.పి జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యాన పలు ఆందోళనలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించాం. వైద్యులపై దాడులు, చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకుగాను కేంద్ర స్థాయిలో ప్రత్యేక చట్టం రావాల్సిన అవసరమెంతైనా ఉంది.

**- డా॥ దీక్షిత్, ఎ.పి జుడా నాయకులు.**

## ఒంటరిగా వెళ్లాలంటేనే భయమేస్తోంది



ప్రస్తుత కాలంలో మహిళలు రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు 24 గంటల్లోపు శిక్షించే చట్టాలను తీసుకు రావాలి. ఆసుపత్రుల్లో మహిళా సిబ్బంది విశ్రాంతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు, ఆసుపత్రుల వద్ద బందోబస్తు పెంచాలి. కఠినమైన చట్టాలను తీసుకురావాలి.

**- సౌందర్య, స్టాఫ్ నర్స్, ఏలూరు సర్వజన ఆసుపత్రి**

## కఠిన చర్యలు తీసుకుంటేనే...



ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి. అలాగే నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వైద్యులకు, వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలి. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఆసుపత్రుల్లో సెక్యూరిటీ పెంచాలి. డ్యూటీ టైంలో ప్రత్యేక సెక్యూరిటీతో గదులు కేటాయించాలి.

**- బి.ఈశ్వరి శివ జ్యోతి, సివిల్ అసిస్టెంట్ సర్జన్, సర్వజన ఆస్పత్రి, ఏలూరు**

## స్త్రీ, పురుషులు సమానం



పురుషాధిక్యత కలిగిన భావజాలం కొల్‌కతా వంటి ఘటనలకు కారణం. ప్రపంచం వేగంగా దూసుకుపోతున్న ఈ కాలంలో కూడా మహిళలు ఇంటికే పరిమితం అవ్వాలి, ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? వంటి వాటిపై ఇంకా చర్చలు జరగడం బాధాకరం. స్త్రీలను పురుషులతో పాటూ సమానంగా సమాజం చూసినప్పుడే ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుంది. కొల్‌కతా ఘటన వెనక ఉన్న నిందితులను ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులు, ప్రభుత్వాలపై ఉంది.

**- డా॥ ఆమలదాసు బిందు, అమలాపురం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా**

## కుటుంబం నుంచే మార్పు రావాలి



ఆడపిల్ల పట్ల కుటుంబాల నుంచే మార్పు రావాలి. తల్లిదండ్రులు పిల్లల్లో మగ, ఆడ పిల్లలను వేర్వేరుగా చూస్తున్నారు. బయట తిరగకుండా కట్టుబాట్ల పేరుతో నిలుపుదల చేస్తున్నారు. ఆడపిల్లల్లో మానసిక స్థైర్యం లేకుండా పోతోంది. స్కూల్, కళాశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్.. సెక్స్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక క్లాసులు ఉండాలి. ఇవి దేశంలో అమలు జరగడం లేదు. ఇటీవల సోషల్ మీడియాలో వికృత రూపం దాల్చుతోంది. ఎలాంటి నియంత్రణ లేదు.. చిన్న పిల్లల నుంచి నీలి చిత్రాలకు అలవాటుపడుతున్నారు. నిరుద్యోగ సమస్య పెద్ద సమస్యగా ఉంది.. ఆడపిల్లల్లో మానసిక స్థైర్యం నింపేందుకు కున్ఫ్యూ, కరాటే వంటి విద్యల్లో శిక్షణ ఇప్పించాలి. దిశ యాప్‌ను యాక్టివ్‌గా పనిచేయించేలా చూడాలి. ఇటువంటి కేసుల్లో వెంటనే అమలు జరిగి భయం అనేది ఉండాలి.

**- డా॥ బి. హర్షితరావు,**
**క్లినికల్ సైకాలజిస్ట్.**

## పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలి



ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొనాలి. పని ప్రాంతాల్లో మహిళలకు భద్రత పెంచాలి. వారికి అన్ని సౌకర్యాలను మెరుగు పరచాలి. కీలకమైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లపై ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం అమానుషం. వైద్యుల ఆందోళనకు అందరూ అండగా నిలిచి మద్దతు పలికారు. వారందరికీ ధన్యవాదాలు.

**- డా॥ జి.మనోహర్ బాబు, జూడాల సంఘ నాయకులు,**
**రంగరాయ మెడికల్ కాలేజీ, కాకినాడ**

## పాలకులకు చిత్తశుద్ధి ఏదీ?



ఈ ఘటన వెనుక ఎంతటి వారున్నా శిక్ష పడితేనే ప్రజలకు పాలకులపై నమ్మకం కలుగుతుంది. రాష్ట్రంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. వాటిని పటిష్టంగా అమలు చేయాలి. మహిళల భద్రతకు భరోసా కల్పించాలి.

**- ఎం. వెంకటలక్ష్మి, ఆశా వర్కర్, రాజమహేంద్రవరం**

## భద్రత పెంచాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందికి భద్రత పెంచాలి. ముఖ్యంగా రాత్రిపూట ఆసుపత్రుల్లోకి ఎవరు ఎందుకు వస్తున్నారో? ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి. భద్రతా చర్యలు లేకపోవడం వల్లే కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అల్లరి మూకలు సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడ్డారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే అది ప్రభుత్వ చర్యలతోనే సాధ్యం.

**- డా॥ వి.సాయి సుధాకర్, హౌస్ సర్జన్ ఇంటెర్న్‌షిప్**
**ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం**

---

**కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో న్యాయం కోసం...దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను పెట్టారు. 'జస్టిస్ టు ద విక్టిమ్' అని నినదిస్తున్నారు. అసలు అది సాధ్యమేనా? ఏ బాధితులకైనా మనం జస్టిస్ ఇవ్వగలుగుతామా?**



జస్టిస్ టు ద విక్టిమ్ (బాధితకు న్యాయం) అంటున్నారు..! అసలు అది సాధ్యమేనా? ఏ బాధితులకైనా మనం జస్టిస్ ఇవ్వగలుగుతామా? ఏ పరిస్థితుల్లో దాన్ని జస్టిస్ అంటాం? ఎవరైతే అత్యాచారం చేశారో వాళ్లను పట్టుకుంటారు. చంపేస్తారు. అంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్టా? మహిళా సంఘాలు కానీ, జూనియర్ డాక్టర్ల సంఘాలు కానీ, ఐఎంఐ కానీ అంతా వారి డిమాండ్లను ముందు పెడుతున్నారంటే..అది కేవలం జస్టిస్ టు ద విక్టిమ్ కాదు. బాధిత కుటుంబానికి కానీ, బాధితులకు కానీ న్యాయం కావాలని మాత్రమే కాదు. రేపు మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలి. అప్పుడు న్యాయం చేసినట్లు.

ప్రస్తుతం డాక్టర్లంతా తమ నిరసనలలో కొన్ని డిమాండ్లు చేస్తున్నారు. 36 గంటల షిఫ్ట్ అంశాన్ని పునరాలోచించాలనేది అందులో ఒకటి.

**అసలు వారి డిమాండ్లు ఏమిటి?**

ఆరోగ్య సంరక్షణ వత్తులలో వున్న వారికి భద్రత కల్పించడానికి ప్రత్యేకంగా కేంద్ర చట్టం ఒకటి కావాలి. ఎక్కడైనా డాక్టరుపై దాడి జరిగితే...ముఖ్యంగా కరోనా సమయంలో రోగులు ఆగ్రహంతో డాక్టర్లను కొట్టిన సందర్భాల్లో కూడా డాక్టర్లు ఏమీ చేయలేకపోయారు. అంటే వారికంటూ ఓ ప్రత్యేకమైన చట్టం లేదు. దాడి జరిగినప్పుడు ఏ సెక్షన్ కింద ఫైల్ చేయాలన్నా డాక్టర్లకంటూ ప్రత్యేకమైన సెక్షన్ లేదు. కాబట్టి వారంతా ఒక సెంట్రల్ లా కావాలని డిమాండ్ చేస్తున్నారు.

**సురక్షితమైన పని వాతావరణం**

ప్రతీ టీచింగ్ హాస్పిటల్లో కానీ, సర్వీస్ హాస్పిటల్లో కానీ, ప్రైవేటు హాస్పిటళ్లలో కానీ వారికి ప్రత్యేకంగా సురక్షితమైన గది ఉండాలి. అన్ని లైంగిక వేధింపు కేసుల్లో తక్షణ న్యాయం జరగాలి.

**మౌలిక సదుపాయాలు**

హాస్పిటల్‌లో కావల్సినన్ని వెంటి లేటర్లు, మందులు, ఐసిఇ లు ఉండవు. దీనంతటికి కారణం అక్కడున్న డాక్టరే అన్నట్లుగా చూపించడం. అసలు అక్క డున్న వ్యవస్థ (సిస్టమ్)ను ప్రశ్నించకుండా అక్కడున్న డాక్టర్‌ను కారకులుగా చేస్తున్నారు. కావల్సినవన్నీ హాస్పిటల్స్‌లో ఎందుకు అందుబాటులో లేవనేది గుర్తించాలి. ఆలోచించాలి. ప్రశ్నించాలి.

**వైద్యుల సంఖ్య**

డాక్టర్‌కు రోజుకు 8 గంటల డ్యూటీ ఉండాలి. కానీ ఇప్పుడది లేదు. కారణం.. తగినంత మంది వైద్యులు లేకపోవడం..! ఒకవేళ వైద్యుల సంఖ్యను పెంచితే ఆటోమేటిక్‌గా డాక్టర్లకు 8 గంటల పని సమయం వస్తుంది.

**డాక్టర్లు : రోగుల సంఖ్య**

మన భారతదేశంలో ఒక డాక్టరు 200 మంది పేషెంట్లను చూడాల్సి వస్తుంది. అంటే ఒక రోగిని పరీక్షించడానికి ఆ డాక్టరుకి కనీసం 3 నిముషాల వ్యవధి కూడా ఉండటం లేదు. అదే ... బ్రిటన్‌లో కానీ, మిగతా దేశాల్లో కానీ ఒక డాక్టరు రోజుకు 30 మంది పేషెంట్లను మాత్రమే చూడగలరనే నియమం ఉంటుంది. ఇలాంటి రూల్ భారతదేశంలో వస్తే కచ్చితంగా వారు దానికే కట్టుబడి ఉంటారు. ఒక డాక్టరుకు 100 లేదా 200 మంది రోగుల బాధ్యత అప్పగిస్తే ఉన్న సమస్య పరిష్కారం కాకపోగా, తూ.తూ మంత్రంగా చికిత్స ఇచ్చే దిశగా వ్యవస్థ నడుస్తుంది. అసలు వ్యాధి ఏంటో తెలీకుండా పోతుంది! 'పేషెంట్ వచ్చారు. వెంటనే మెడిసన్ రాసి పంపాలి..' అంతే అయి పోయింది.! కనీసం ఆ పేషెంట్‌తో ఇంటారాక్ట్ అయ్యే సమయం కూడా ఆ డాక్టరుకు ఉండదు. కనీసం ఆ రోగి మళ్లీ వస్తే ఆ డాక్టరు గుర్తుపట్టే పరిస్థితి కూడా ఉండదు. ఇదీ ఇప్పుడు గవర్నమెంట్ హాస్పిటళ్లలో పరిస్థితి! ఇక ప్రైవేటు హాస్పిటల్‌కి వస్తే అది వారి ఇష్టం. అయితే గవర్నమెంట్ హాస్పిటళ్లలో ఇంతమంది డాక్టర్లకు ఇంతమంది పేషెంట్లు అని నియమాలు ఎందుకు లేవు? ఈ నియమం కనుక పెడితే చాలావరకు డాక్టర్లపై దాడులు తగ్గుతాయి.

**ఇదీ డాక్టర్ల పరిస్థితి**

మన దేశంలో డాక్టర్లు చాలామంది ఉన్నారు. కానీ ఇప్పటికీ వారికి ఉద్యోగాలు లేవు. 1500 పోస్టులను ప్రకటిస్తే..700 మందికి మాత్రమే ఉద్యోగాలొస్తున్నాయి. అవి కూడా అతి తక్కువ శాలరీలతో! ఒకరు డాక్టరవ్వాలంటే 15 సంవత్సరాలు కష్టపడాలి. తీరా డాక్టరయ్యాక ఆ డాక్టరికిచ్చే శాలరీ కేవలం రూ.86 వేలు. ఈ జీతాలతో వారు పెట్టిన లోన్లు ఎలా కట్టాలి? ఇంట్లో ఎలా గడవాలి? చివరకు డాక్టర్లకు రావాల్సిన స్టయిఫండ్లు కూడా ఎప్పుడూ సమయానికి రావు. దానికోసం కూడా వారు నిరసనలు చేయాల్సిందే! డాక్టర్లు ప్రతీదాన్ని అడక్కుండా ఇచ్చే పరిస్థితి లేదు. చివరకు నిద్రించడానికి రూం, బెడ్‌షీట్ అన్నీ అడగాల్సిందే. 36 గంటల డ్యూటీ చేస్తున్న డాక్టర్లకు కనీసం స్టయిపెండ్ కూడా టైంకు రావడం లేదు. కనీసం అడిగేవారు కూడా లేకపోవడం శోచనీయం! ఆ స్టయిపెండ్ కూడా రూ.40, రూ.50 వేలు. ఇదీ డాక్టర్ల పరిస్థితి.



**డాక్టర్ దేశం పి.ఆర్.**
**ఎంబిబిఎస్, ఎండి,**
**ప్రజారోగ్య నిపుణులు.**

---

## కేరళ చట్టం భేష్
### ఐ.ఎం.ఎ సహా అందరి నోటా ఇదే మాట

కోల్‌కతా ఆర్.జి.కర్ ఆస్పత్రిలో పిజి ఇంటర్న్ అభయ అమానుష హత్యాచారానికి బలైన తర్వాత దేశమంతా వినిపిస్తున్న ఒకే మాట...ఆస్పత్రులలో వీరికి భద్రత కల్పించడానికి ఏం చేయాలన్నదే. దీనిపై కేంద్ర చట్టం తీసుకు రావాలని అందరూ ఒక్క గొంతుతో కోరుతున్నారు. అయితే కేంద్రం గతంలో అలాంటి ఆలోచన చేసి సలహాలు సూచనలు తీసుకున్నా వెనకడుగు వేసింది. పైపెచ్చు ఇది రాష్ట్రాల జాబితాలోని అంశం గనక తానేదో తటపటాయిస్తున్నట్టు చిత్రిస్తున్నది. అసలు ఆ ప్రభుత్వాల మనుగడనే సహించలేని మోడీ సర్కారు ఈ ఒక్క విషయంలో ఊగిసలాడటానికి కారణం కార్పొరేట్ లాబీ తప్ప మరొకటి కాదని స్పష్టంగా చెప్పొచ్చు. ఈ సందర్భంగా ఐఎంఎతో సహా అందరూ కేరళలో వైద్యశాలల సిబ్బంది పరిరక్షణ చట్టం సంగతి ప్రస్తావిస్తున్నారు.

ఆరోగ్యరక్షణ కేంద్రాలలో వైద్య సేవా వ్యక్తుల సంస్థల రక్షణ (హింసాకాండ, ఆస్తుల విధ్వంసం) 2012 చట్టంలో కాలానుగుణంగా తగు మార్పులు చేసి అమలు జరుపుతున్నది, దానివల్ల దాడులు ఘటనలు తగ్గినట్టు కూడా ఐఎంఎ అధ్యక్షుడు అశోకన్ చెబుతున్నారు. కరోనా సమయంలో కేరళ వైద్య వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేసిందో ప్రపంచమంతా చూసింది.

2023 మేలో కొట్టారక్కర జిల్లాలోని ఒక తాలూకా ఆస్పత్రిలో సందీప్ అనే నేరస్తు ఉపాధ్యాయుడి దురాగతం కారణంగా డా.వందనా దాస్ అనే డాక్టర్ మృతి చెందింది. అంతకు ముందు చికిత్స కోసం ఖైదీగా అతన్ని తీసుకువచ్చినపుడు అక్కడున్న శస్త్ర చికిత్సా పరికరాలు తీసుకుని విచక్షణా రహితంగా సిబ్బందిపై దాడి చేశాడు. వందనా దాస్ ఆ దాడిలోనే చనిపోయారు. కేరళను కలిచివేసిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్వయంగా రంగంలోకి దిగి తక్షణ చర్యలు తీసుకున్నారు. అంతకు ముందు చట్టంలో మరిన్ని అంశాలు చేరుస్తూ ఒక ఆర్డినెన్సు విడుదలచేశారు.

పోలీసులు కూడా వేగంగాకదిలి చర్యలు తీసుకున్నారు.ఈ కేసును సిబిఐకి అప్పగించాలనే అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ ఆర్డినెన్సు మేరకు ఆస్పత్రులలో భద్రతను, పోలీసులు, సిబ్బంది సంఖ్యను కూడా పెంచారు. శాసనసభలో దీన్ని వివాదంగా చేయాలనే యుడిఎఫ్ ప్రయత్నం కూడా ఫలించలేదు. కేరళలో ఆయుర్వేద సంస్థలు కూడా విస్తారంగా వుంటాయన్నది తెలిసిన విషయమే. నర్సులుగా కూడా అక్కడ శిక్షణ పొందడం ఎక్కువ. ఈ నేపథ్యంలో కేరళ వైద్యశాలల రక్షణ చట్టం అందరి మన్నన పొందింది.

మొన్న మార్చిలో వైద్యశాఖ మంత్రి వీణా జార్జి కోడ్ గ్రే ప్రొటోకోల్ అనే కొత్త నిబంధనను కూడా విడుదల చేశారు. ఆస్పత్రిలో ఎవరైనా బయటివారు రోగి లేదా మరెవరైనా దుందుడుకుగా హింసాత్మకంగా ప్రవర్తిస్తే కోడ్ విడుదల చేస్తారు. దీని ప్రకారం భద్రతా సిబ్బంది మాత్రమే గాక అక్కడ మరెవరైనా అలాటివారిని నిరోధించే అధికారం



లభిస్తుంది. ఇప్పుడు తెచ్చే చట్టాలలో కూడా అలాంటి నిబంధన పెట్టాలని ఐఎంఎ కోరుతున్నది. దీంతోపాటు భద్రతా ఆడిట్ కూడా వుంటుంది.ఇవన్నిటినీ ఇప్పుడు పరిశీలించి సరైన చట్టం తేవడం అవసరం.

---

## 'ధర్మా'గ్రహం



**కోల్‌కతాలోని ఆర్.జి.కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో పోస్టుగ్రాడ్యుయేట్‌పై జరిగిన హత్యాచార ఘటనపై అత్యున్నత ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ పార్థివాలా మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ సుమోటోగా విచారణ జరుపుతోంది. నిందితులకు కొమ్ము కాసే ప్రతి చర్యనూ ధర్మాసనం వేలెత్తి చూపించింది. బెంగాల్ ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి, ఆస్పత్రి యాజమాన్యానికి చెంప చెళ్లు మనిపించేలా అనేక ప్రశ్నలు సంధించింది.**

అన్నిటినీ మించి నిత్యం అభద్రత, భయాందోళనల మధ్య సేవలందిస్తున్న వైద్యుల దుస్థితి ధర్మాసనాన్ని కదిలించివేసింది.

**వైద్యుల జాతీయ టాస్క్‌ఫోర్స్**

దేశంలో వైద్యుల, సిబ్బంది భద్రత కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందిం చేందుకు, 10 మంది ఉన్నత వైద్యాధికారులతో కూడిన జాతీయ టాస్క్ ఫోర్స్‌ను సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. డాక్టర్ల భద్రత కోసం తీసుకోవలసిన చర్యలను ఈ కమిటీ రూపొందించనుంది. సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్పి సరిన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ జాతీయ టాస్క్ ఫోర్స్ కమిటీలో డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఎం.ప్రతిమామూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్‌పూరి, డాక్టర్ సౌమిత్రా రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా, ప్రొఫెసర్ పల్లవి సప్రే, డాక్టర్ పద్మా శ్రీవాస్తవా సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఇద్దరు నిపుణులు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు.

సుప్రీం చేపట్టిన ఈ చర్యతో లోపభూయిష్టంగా, అభద్రతా భావంలో ఉన్న భారత వైద్య వ్యవస్థ చక్కబడే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నాళ్ల నుంచో అరణ్య రోదనగా మిగిలి పోయిన జాతీయ మెడికల్ అసోసియేషన్ ప్రతిపాదనలు, వైద్యుల రక్షణ సమస్యలపై చర్చ ముందుకొచ్చింది. వీటన్నింటిపై మూడు వారాల్లో మధ్యంతర నివేదిక ఇవ్వాలని, మరో రెండు నెలల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని టాస్క్ ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

**భద్రత ప్రశ్నార్థకం**

"కోల్‌కతా ఘటన దేశంలోని వైద్యుల భద్రతపై అనేక పశ్నలు లేవనెత్తుతోంది. సేవలందిస్తున్న వైద్య సిబ్బంది అత్యంత తేలికగా హింసకు గురవుతున్నారు. చాలా మంది మహిళలు వైద్య వృత్తిలో ఉన్నారు. వారి ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో మార్పు తేవడానికి మరో అత్యాచారం జరిగే వరకు దేశం ఎదురు చూడాలా?" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు.

**సిబిఐకి ఆదేశం**

కోల్‌కతా ఘటనకు సంబంధించి జరుపుతున్న దర్యాప్తుపై, విచారణలో పురోగతిపై తక్షణ నివేదిక ఇవ్వాలని సిబిఐని ఆదేశించింది. తాను వేసిన ప్రశ్నలకు సమాధానాలను రాబట్టి, ఈ కేసు స్టేటస్ రిపోర్టును ఈ నెల 22 నాటికి తన ముందుంచాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

**సుప్రీం ప్రశ్నల వర్షం**

–హత్యాచారం కేసును నీరు గార్చేందుకు బాధ్యతారహితంగా వ్యవహరించిన బెంగాల్ ప్రభుత్వంపై, పోలీసు వ్యవస్థపై, ఆస్పత్రి యాజమాన్యంపై సుప్రీంకోర్టు అనేక ప్రశ్నలు సంధించింది.

1. ఈ సంఘటనకు సంబంధించిన ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం ఎందుకు జరిగింది? (సాధారణంగా ఏ కేసులోనైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత మాత్రమే మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపిస్తారు. కానీ, ఈ కేసులో ఎఫ్ఐఆర్ ఫైల్ చేయకుండా సాయంత్రం 6 గంటలకు పోస్టుమార్టంకు పంపించారు) మొత్తానికి తెల్లవారు జామున దారుణం జరిగితే రాత్రి 11.45 గంటల వరకు ఎఫ్ఐఆర్ ఎందుకు ఫైల్ చేయలేదు? బాధితురాలి మృతదేహాన్ని అంత్య క్రియలకు అప్పగించాక ధీమాగా ఎఫ్ఐఆర్ ఫైల్ చేస్తారా?
2. ఘటన జరిగినప్పుడు బాధితురాలి తల్లిదండ్రులు ఆస్పత్రిలో లేరు కనుక కేసు నమోదుచేయాల్సిన బాధ్యత ఆస్పత్రిది కాదా? ఆస్పత్రి అథారిటీ ఏం చేస్తోంది?
3. కూతురి మృతదేహాన్ని చూపించేందుకు కన్న తల్లిదండ్రులను సైతం నాలుగు గంటల పాటు ఎందుకు నిలబెట్టి ఉంచారు?
4. ఈ భయానకంగా, దుస్తులు సైతం లేకుండా మృతదేహం పడి ఉండడాన్ని చూసి, హత్య అని గుర్తించి కూడా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ – దాన్ని ఆత్మహత్యగా చిత్రించేందుకు ఎందుకు ప్రయత్నించారు?
5. ప్రిన్సిపాల్ అనుమానాస్పద ప్రవర్తనపై పరిశీలన జరుగుతుండగానే ఆయనను హడావుడిగా మరో కాలేజీకి ప్రిన్సిపాల్‌గా ఎందుకు బదిలీ చేశారు?
6. దుండగులపై ఒక్క కేసూ నమోదు చేయని బెంగాల్ ప్రభుత్వం – హత్యపై ఆవేదనతో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై మాత్రం ఎందుకు బల ప్రయోగానికి దిగింది?
7. గురువారం (ఆగస్టు 22వ తేదీ) తెల్లవారుజామున 7 వేల మంది ఆస్పత్రిపై దాడి ఎలా చేశారు? ఆ సమయంలో ఘటనా స్థలం నుంచి పోలీసులు పారిపోయారా? దీనికి సమాధానం ఏమిటి? దాడి చేసిన వారిలో 70–80 మంది ఆస్పత్రిలోకి జొరబడి విధ్వంసం సృష్టించారు. రెసిడెంట్ వైద్యులను 'ఎదురుతిరిగితే మీకూ ఇదే గతి పడుతుంది' అంటూ బాహాటంగా బెదిరించి, భయభ్రాంతులకు గురి చేస్తే పోలీసులు ఏం చేస్తున్నారు?
8. బెంగాల్ ప్రభుత్వంపై పోలీసు బలగాలపై తమకు నమ్మకం లేదని ధర్మాసనం చెప్పకనే చెప్పింది. అందుకే కేంద్ర పోలీసు బలగాలను రప్పించి ఆస్పత్రి ఎదుట భద్రతా ఏర్పాట్లు చేయాలని కోర్టు ఆదేశించింది.
9. వైద్యురాలి ఘటనపై శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న వారిపై ఎటువంటి బలప్రయోగం చేయొద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు హెచ్చరించింది.
10. ఆస్పత్రిపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన వారందరినీ తక్షణం అరెస్టు చేసి, వారిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలని ఆదేశించింది.
11. బాధితురాలి పోస్టుమార్టం రిపోర్టును కోర్టు కూలంకుషంగా పరిశీలించింది.

**వైద్యుల రక్షణ కోసం ఆదేశాలు**

ఆస్పత్రుల్లో డే, నైట్‌డ్యూటీలు చేస్తున్న వైద్యులు, సిబ్బందికి ఆస్పత్రుల యాజమాన్యాలు రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించింది. ఇందుకోసం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

- ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు అందించే గదుల వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలి.
- వైద్యులకు, నర్సులకు రెస్ట్ రూముల వసతి కల్పించాలి. అక్కడ బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ ఏర్పాట్లు ఉండాలి.
- ఆస్పత్రిలోకి ఎవరూ ఎటువంటి ప్రమాదకర వస్తువులు తేకుండా బ్యాగేజీ స్క్రీనింగ్ చేయాలి. విజిటర్స్ సంఖ్యపై పరిమితి విధించాలి.
- తగినంత మంది సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.
- ఆస్పత్రుల ప్రాంగణాల్లోని అన్ని ప్రాంతాల్లో సరిపడా గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాటు చేయాలి.
- ఆస్పత్రుల లోపల, బయటి ప్రాంతాల్లో సిసి కెమెరాలు అమర్చాలి
- రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము 6 గంటల మధ్య విధుల్లో ఉండే సిబ్బందికి రవాణా సదుపాయం కల్పించాలి
- సంక్షోభ, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా సిబ్బందిలో, వైద్యుల్లో మనోధైర్యం పెంచేందుకు విస్తృతంగా వర్క్‌షాప్‌లను నిర్వహించాలి
- భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష జరపాలి.
- మహిళా ఉద్యోగులందరికీ సురక్షితమైన పని పరిస్థితులు కల్పించాలన్న నిబంధన వైద్య సంస్థలకూ వర్తిస్తుంది. అందుకు అనుగుణంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి.
- వైద్య నిపుణులకు అత్యవసర పరిస్థితుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాట్లో ఉంచాలి.
- బాధిత వైద్యురాలి ఫొటోలు, వీడియోలు, మృతదేహం పడిఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దృశ్యాలను బాధ్యతాయుత పౌరులు సానుభూతితోగాని లేక, మరే రకంగా గాని మొబైల్స్ ద్వారా ఫార్వర్డ్ చేయవద్దని, డిలీట్ చేయాలని కోర్టు ఆదేశించింది.

**జాతీయ ప్రొటోకాల్**

"మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే, సేవలందించే ప్రదేశాల్లో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్టే. ఈ రోజుల్లో చాలా మంది యువ డాక్టర్లు కంటి మీద కునుకు లేకుండా 36 గంటలూ నిర్విరామంగా, ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి మన పని ప్రదేశాల్లో పటిష్ట భద్రత కల్పించేందుకు ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరం" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

**- స్పెషల్ డెస్క్**

---



## ఆమె కోసం నిలబడదాం

ఆ రాత్రి చీకటి గోసపెట్టి ఏడ్చింది
మానవ మృగాలు సామూహిక దాడిలో
అభయ మరణ ఘోషకి
కలకత్తా కాళి ఘీంకరించింది....
ఠాగూర్ పుట్టిన గడ్డ
నేతాజీ తిరిగిన నేల
జనగణమన, వందే మాతరగీతం పురుడు పోసుకున్న ప్రాంతం.
కాళికా దేవి రూపానికి ప్రతీక
బ్రిటీష్ పాలిట సింహస్వప్నమైన తిరుగు
బాటు జెండా ఎగిరిన చోట
అభయ మరణ మృదంగం.
ఇప్పుడు ఆమె కళ్ల నెత్తురుతో
తూరుపు కల్లాపేసుకుంది
ఆమె వదిలిన ఊపిరి నేడూ ఉద్యమానికి
ఊపిరిలూదింది.
దేశం నలుమూలల రగులుతున్న
నినాదం ఆమె కోసం నిలబడదాం
ఓ కొవ్వొత్తిలా వెలుగుదాం
ఓ మౌన ఘోషై నినదిద్దాం
ఆమె కోసం నిల బడదాం.

**- రెడ్డి శంకరరావు,**
**సెల్ : 9494333511**

## స్వతంత్ర రాజ్యమా..!

దేశమా...స్వతంత్ర్య రాజ్యమా..
ఆడదానిగా పుట్టటమే నేరమా..

విశృంఖల వికృత తృష్ణల
మృగారణ్య బాటలో
కదలలేక మెదలలేక
శిలనైతిని కల నైతినీ...

మానవత్వమే లేని
కామాసురుల నడుమ
వధించలేక లేక చరించ లేక
శిథిల మైతిని ఛిద్రమైతినీ ..

కామాంధుల లోకంలో
కానరాని స్వేచ్ఛలో
శపించలేక గతించలేక
చరణమైతిని రణమైతిని

సాధించిన స్వాతంత్ర్యం
చతికిలబడి చూస్తుంటే
చావలేక దిగంబరమైతిని
బ్రతక లేక అంబరాన సగమైతిని..!

**- డా. కటుకోర్యుల రమేష్,**
**సెల్: 9949083327**

# వైద్యుల రక్షణకు చట్టాలొక్కటే చాలవు

## ఆరోగ్య సిబ్బంది భద్రత చట్టాల ప్రభావంపై లోతైన తనిఖీ అవసరం





జస్టిస్ ఎన్.వి. రమణ

ఆర్.జి.కర్ కేసును సుప్రీం కోర్టు సూమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం మాజీ ప్రధాన న్యాయమూర్తి ఓ ఆంగ్ల పత్రికకు వ్యాసం రాస్తూ, దేశంలో 23 రాష్ట్రాలు ఆరోగ్య సిబ్బంది భద్రత చట్టాలను తెచ్చాయని, అయితే వాటి ప్రభావంపై లోతైన తనిఖీ జరగాలని, జరిమానాలు దేశవ్యాప్తంగా ఒకేవిధంగా ఉండేలా చూడాల్సిన అవసరం వుందని అభిప్రాయపడ్డారు.

కోల్‌కతా ఆర్.జి కర్ మెడికల్ కాలేజి, ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య దేశవ్యాప్తంగా వైద్యుల భద్రతకు సంబంధించిన అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఈ హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో పౌర కవాతులు కొనసాగుతున్నాయి. ఎంతోకాలంగా పీడిస్తున్న ఈ జాడ్యానికి తగు దిద్దుబాటు చర్యలను ప్రభుత్వాలు తక్షణమే చేపట్టాల్సిన అవసరాన్ని ఇది ముందుకు తెచ్చింది. అందరికీ ఆరోగ్యకరమైన, హుందాగా జీవించే హక్కు కల్పించాలన్న మన రాజ్యాంగ ఆశయం నెరవేరాలంటే పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థ కలిగివున్నపుడే సాధ్యం. అదే క్రమంలో వైద్యులకు లభించాల్సిన సముచిత గౌరవ ప్రతిపత్తి దక్కేలా చూడాల్సిన అవసరమూ ఉంది.

### నిర్లక్ష్యం నీడలో ఆరోగ్య భద్రత

దురదృష్టవశాత్తు దేశంలో ఆరోగ్య భద్రత వ్యవస్థపై తగినంత శ్రద్ధ పెట్టడంలో వరుసగా ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ ప్రభుత్వాల వైఫల్యాల వల్లే ఆరోగ్య వ్యవస్థ నేడు ఇంతగా కార్పొరేటీకరించబడింది. గత కొంతకాలంగా కార్పొరేటీకరించబడుతుంది. ఫలితంగా సమాజంలోని వివిధ తరగతుల ప్రజానీకానికి నాణ్యమైన ఆరోగ్య సేవల అందుబాటులో అంతరాలు పెరిగిపోయాయి. భారత జనాభాలో అతిపెద్ద సెక్షన్ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య ఖర్చులను భరించలేక ప్రజారోగ్య వ్యవస్థపైన ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రద్దీ పెరిగింది. ఇది ప్రభుత్వ వైద్యలపై ఒత్తిడి పెంచుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులను మౌలిక సదుపాయాల కొరత వెంటాడుతుండడం వంటి బాహ్య కారణాలు దీనికి తోడవడంతో వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా తయారవుతోంది. ప్రభుత్వ డాక్టర్లు అలాగే పారా మెడికల్ సిబ్బంది నేడు ముఖ్యంగా మూడు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. 1. మౌలిక సదుపాయాలు, వనరుల కొరత, 2. పేలవమైన పని పరిస్థితులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది వేధింపులకు గురికావడం, 3. అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, భద్రతా వాతావరణం ఆసుపత్రులలో లేకపోవడంతో మహిళా వైద్యులు అనేక ఇబ్బందులనెదుర్కొంటున్నారు. మెడికల్ అసోసియేషన్లు ఈ సమస్యలపై తగినంత దృష్టి పెట్టలేకపోవడం వల్ల పరిస్థితి మరింతగా క్షీణించింది. ఆరోగ్య నిపుణుల మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ నిరంతరం ఉండాలి. కోవిడ్ మహమ్మారి విజృంభించినప్పుడు డాక్టర్లు, ఇతర హెల్త్ కేర్ సిబ్బంది పని పరిస్థితులు కచ్చితంగా, సురక్షితంగా ఉండేలా చూసేందుకు 2020 అంటువ్యాధుల (సవరణ) ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. ఆ తరువాత వాటి గురించి పట్టించుకోలేదనే చెప్పాలి.

**ప్రస్తుతం ఉనికిలో ఉన్న చట్టాలను సమీక్షించాలి**

వైద్య సేవలందించే సిబ్బంది, మెడికేర్ సేవలందించే సంస్థలు (హింస, ఆస్తి నష్టాన్ని నిరోధించే)యాక్ట్ -2007 (దీన్నే మెడికల్ ప్రొటెక్షన్ యాక్ట్ అని కూడా అంటారు)ను దేశంలోని 23 రాష్ట్రాలు తెచ్చాయి. అయితే వాటి అమలుతీరు ఇప్పటికీ సందేహాస్పదమే. నమోదయిన ఎఫ్ఐఆర్‌లు, దోషులకు శిక్షపడిన దాఖలాలు, సంబంధిత వ్యక్తుల్లో ఏమేరకు అవగాహన కల్పిస్తున్నారు వంటి అంశాలను లోతుగా తనిఖీ చేయాల్సి ఉంది. ఈ చట్టం కింద నమోదయిన ఎఫ్ఐఆర్‌లెన్ని, వాటిలో చార్జిషీట్లు దాఖలైనవెన్ని? ఈ చట్టం కింద శిక్షపడినవెన్ని? వంటి డేటాను అర్థం చేసుకోవాలంటే ఇతర చట్టాల్లో మాదిరిగానే ఈ చట్టం అమలు విషయంలోను సరైన తనిఖీ వ్యవస్థ ఉండాలి. కేవలం చట్టాలు చేస్తే సరిపోదు. తమిళనాడు, పాండిచ్చేరి వంటి రాష్ట్రాలు మినహాయిస్తే చాలా రాష్ట్రాల్లో శిక్షలు పరిమితంగా ఉంటున్నాయి. తమిళనాడు, పాండిచ్చేరిలలో ఈ చట్టం కింద దోషిగా తేలినవారికి మూడు నుంచి పదేళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఇతర రాష్ట్రాల్లో మూడేళ్ళ జైలుశిక్ష, జరిమానాతో సరిపెడుతున్నారు. శిక్షలకు సంబంధించి రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య తేడాలున్నాయి. కాబట్టి ఈ విషయంలో కేంద్రం రాష్ట్రాలతో సంప్రదించి ఒక ఉమ్మడి నమూనా చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరముంది. ప్రొఫెషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్-2020ని ఇతర పరిశ్రమల సేఫ్టీతో కలిపి పార్లమెంటులో ఇదివరకే ప్రవేశపెట్టారు. ఈ కోడ్‌లో ఆరోగ్య పరిశ్రమకు సంబంధించి ఎలాంటి నిర్దిష్టమైన ప్రస్తావన లేదు. కాబట్టి డాక్టర్ల భద్రతకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒక కోడ్‌ను తక్షణమే తీసుకు రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. కేంద్రం ఈ విషయమై ఒక నమూనా చట్టాన్ని రూపొందించి రాష్ట్రాలకు సర్క్యులేట్ చేయాలి.

### తీవ్ర ఆందోళన కలిగిస్తున్న హింస

డాక్టర్లు తమ విధులను ఎటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో నిర్వర్తిస్తున్నారో చూస్తున్నాం. రద్దీ ఎక్కువగా ఉండే ఆసుపత్రుల్లో రోగులు, వారి కుటుంబ సభ్యుల బాధ, ఆక్రోశం వల్ల కూడా కొన్నిసార్లు సమస్యలు తలెత్తుతున్నాయి. పని ప్రదేశంలో హింసను ఎదుర్కొంటున్న డాక్టర్ల శాతం అమెరికాలో 47శాతం ఉండగా, భారత్‌లో ఇది 75 శాతంగా ఉందని సర్వేలు ఘోషిస్తున్నాయి. దాడికి పాల్పడినవారు సాధారణంగా రోగులు, వారి బంధువులేనని సర్వేలు తెలిపాయి. ఇటీవల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన ఓ సర్వేలో 82.7శాతం మంది డాక్టర్లు ఒత్తిడికి గురవుతున్నట్లు వెల్లడైంది. వీరిలో 62.8 శాతం మంది హింస భయంతో ఒత్తిడికి గురవుతున్నామని చెప్పగా, 46.3శాతం మంది హింసే తమ ఒత్తిడికి ప్రధాన కారణమని ఫీలయ్యారు. అందులోనూ బొత్తిగా అనుభవంలేని యువ డాక్టర్లు, మహిళా డాక్టర్లు ఎక్కువగా హింసకు గురవుతున్నారు. దీన్ని బట్టి ఆరోగ్య సేవలందించే నిపుణులపై హింసను నిరోధించేందుకు తీసుకొచ్చిన హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ బిల్లు-2022ను ఆమోదించి అమలులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2022లో పార్లమెంటులో ప్రవేశపెట్టబడిన ఈ బిల్లు పై ఇప్పుడు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరముంది.

### భద్రతకు ప్రణాళిక

ప్రజారోగ్య సిబ్బంది భద్రత అనేది విదానపరమైన అంశంగా పరిగణించి ఇందుకోసం దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాలి. ఇందుకు సంబందించి ఉమ్మడిగా తీసుకురావాల్సిన మార్పులు దీర్ఘకాలిక ప్రాతిపదికన ప్రభుత్వం పరిశీలించేందుకు కోర్టులు దారి చూపాలి. తాను ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జార్ఖండ్‌లో ఓ న్యాయాధికారికి ఇటువంటి భయానక ఘటనలో ప్రమేయం వున్న విషయం దృష్టికి రాగానే సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని దీనిపై దర్యాప్తును పర్యవేక్షించాల్సిందిగా జార్ఖండ్ హైకోర్టును ఆదేశించింది. చివరగా ఒక విషయం. యువకులు ఎక్కువమంది డాక్టర్లు కావడానికి, సమాజానికి సేవచేయడానికి అనువైన వాతావరణాన్ని మనం విధిగా కల్పించాలి. చాలామంది చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి డాక్టర్లు కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. వారు విద్య, సహాయం, ఉపాధి కోసం ఎక్కువగా ప్రభుత్వంపైనే ఆధారపడతారు. వారికి ఈ సహకారం అందించడంతోనే బాధ్యత తీరినట్లు కాదు, డాక్టర్ల సంక్షేమం, వారి పని పరిస్థితుల మెరుగుదలపై కూడా దృష్టి సారించాలి. అటువంటి ప్రోత్సాహక వాతావరణం లేనప్పుడు అది మేధోవలసకు దారితీస్తుంది. అలాంటప్పుడు నైపుణ్యం కలిగిన సమర్థవంతమైన యువ డాక్టర్లు భవిష్యత్తులో భారత్‌లో ఉండే పరిస్థితి లేకపోవచ్చు.

వైద్యసంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాలి. డాక్టర్ల వేతనాల పెంపు, పించన్లు, సామాజిక భద్రత, భద్రతా చర్యలు, మెరుగైన పని పరిస్థితులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. ఆర్.జి కర్ భయానక ఘటన, దానిపై దేశవ్యాపితంగా వ్యక్తమవుతున్న ఆందోళనలు పైన పేర్కొన్న చర్యలు చేపట్టడంలోను, దేశంలో వైద్యులకు అవసరమైన సదుపాయాలు కల్పించే విషయంలోను వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తి చూపుతున్నాయి.

> **ఆర్.జి.కర్ కేసును సుప్రీం కోర్టు సూమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం మాజీ ప్రధాన న్యాయమూర్తి ఓ ఆంగ్ల పత్రికకు వ్యాసం రాస్తూ, దేశంలో 23 రాష్ట్రాలు ఆరోగ్య సిబ్బంది భద్రత చట్టాలను తెచ్చాయని, అయితే వాటి ప్రభావంపై లోతైన తనిఖీ జరగాలని, జరిమానాలు దేశవ్యాప్తంగా ఒకేవిధంగా ఉండేలా చూడాల్సిన అవసరం వుందని అభిప్రాయపడ్డారు.**

## ప్రదర్శన

రండి రండి
మరోసారి
కొవ్వొత్తులను వెలిగించడానికి
వేళైంది
నాలుగు క్లిక్కులతో
వందల పోస్టులతో
అలజడి రేపి
రాత్రవగానే వెచ్చగా బజ్జుందాం.

2012వ నిర్భయ ఆర్తనాదాలు పాతబడి
ఢిల్లీ యథాతథంగా నిలబడింది
దిశ కన్నీళ్ళను తాగిన
మరొక రాష్ట్రం
అన్నిటినీ మరుపు పొదలలో
పాతిపెట్టింది
గాజుల చేతి మానాన్ని శ్వాసను
హింసించి హరించిన
కోల్‌కతా మౌనంగా ఉంది.

ఆయేషాల ఆసీఫాల అమ్మలు
నిర్భయ దిశల కుటుంబాలు
పచ్చిగాయాలను తడుముకుంటూ
బ్రతుకీడుస్తున్నారు.
దేశంలో
పెదవులు మాట్లాడుకోవడానికి
పోట్లాడుకోవడానికి
జుట్టు జుట్టు పట్టుకోవడానికి
అభిమాన హీరోపై ప్రేమో
ఇష్టమైన రాజకీయపు జెండానో
ఉన్నాయి కదా.

ఇక్కడ మీసాలు దువ్వుతూ
మగతనాలు
బహిరంగంగానే ప్రదర్శనకు దిగి
ఆడ దేహాలను
రంజుగా నంజుకుంటున్నాయి
రాజ్యం
నామమాత్రపు చట్టాలను వండి
చుట్టాలకు చేతులడ్డుపెట్టి
తీరికగా చుట్ట కాల్చుకుంటోంది
రండి రండి
డిపీలపై నలుపును పులిమి
ఓటిటిలో సినిమాలు చూద్దాం
ఫేస్ బుక్కులపై
కాసిని పోస్టులను చల్లి
పావులర్ అవుదాం.

దేశం నడివీధిలో రక్తమోడుతూ
నగ్నంగా నిలబడితే ఏమైంది
ఏలికలసలే రాజ్యమేలుతూ
వేరే ముఖ్యమైన విషయాలలో
బిజీగా ఉన్నారు
రారండోయ్ వేడుక చూద్దాం.

- పద్మావతి రాంభక్త
సెల్ : 9966307777

# మా కలలు చెదిరిపోయాయి



## తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

**కోల్‌కతాలోని ఆర్.జి.కర్ హాస్పిటల్‌లోని సెమినార్ హాల్‌లో 31 ఏళ్ల వైద్యురాలిపై సాగించిన హత్యాచారం ప్రతి ఒక్కరిని కలచివేస్తోంది. ఇక, ఆ అభయను కన్న తల్లిదండ్రులు ఈ దారుణ ఘటనను తలచుకుని ఎంతగా కుమిలిపోతున్నారో చెప్పనలవికాదు.**

'అరవై రెండేళ్ల వయసులో, మా కలలన్నీ చెదిరి పోయాయి....ఏ కష్టం వచ్చినా నేనున్నా అనేది. నా కూతురు నన్నెప్పుడూ జాగ్రత్తగా చూసుకునేది' అని వైద్యురాలి తండ్రి చెప్తుంటే, తల్లి మౌనంగా రోదిస్తోంది.

ఆగస్టు తొమ్మిదో తేదీన ఆ ఘటన జరగడానికి కొన్ని గంటల ముందు అంటే రాత్రి 11 గంటల సమయంలో అభయ చివరిసారిగా తల్లితో మాట్లాడుతూ "నాన్న టైమ్‌కు మందులు వేసుకునేలా చూడమ్మా. నా గురించి భయపడొద్దు" అని చెప్పింది. 'అవే ఆమె మాతో మాట్లాడిన చివరి మాటలు. తర్వాత రోజు, ఆమె ఫోన్ రింగ్ అవుతూనే ఉంది...' అని చెప్పారు.

### కనురెప్పలా కాపాడింది...

తండ్రి అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. సమయానికి మందులు వేసుకోవడం అత్యంత ముఖ్యం. 'నేను ఈ మందులు వేసుకోవడం మర్చిపోకుండా ఆమె నిత్యం నన్ను చూసుకునేది, ఒకసారి మందులు అయిపోయినప్పుడు, తర్వాత రోజు కొనుక్కుందాం అనుకున్నా. కానీ, మందులు అయిపోయిన విషయాన్ని నా కూతురు గమనించింది. అప్పుడు సమయం రాత్రి పదో, పదకొండో అవుతోంది. సరిగ్గా భోజనానికి ముందు బాపి (నాన్నా) మీ మందులు వచ్చేవరకూ ఇంట్లో ఎవరూ భోజనం చేయరు' అని కూతురు చెప్పిన విషయాన్ని వివరిస్తూ ఆయన కన్నీరు పెట్టుకున్నారు. 'నేను దేని గురించీ బాధపడకుండా నా కూతురు చూసుకునేది. మమ్మల్ని తను కనురెప్పలా కాపాడుకుంది'.

### గోల్డ్ మెడల్ సాధించాలనుకుంది...

'ప్రతిరోజూ నిద్ర పోవడానికి ముందు ఆమె డైరీ రాసుకునేది! మెడికల్ కాలేజీలో గోల్డ్ మెడల్ సంపాదించుకోవాలని ఆమె డైరీలో రాసుకుంది. మంచి జీవితాన్ని గడపాలనుకుంది. మమ్మల్ని బాగా చూసుకోవాలనుకుంది' అంటూ తల్లి కుమార్తెను గుర్తుకుతెచ్చుకున్నారు. 'ఆమె ఎప్పుడూ తన గురించి కాకుండా, ఇతరుల గురించి ఆలోచించేది. ఆమె పెళ్లి దాదాపు ఖరారైంది. అప్పుడు నా కూతురు.. "కానీ... బాపి (నాన్నా) ఆ డబ్బంతా ఎక్కడి నుంచి తెస్తారు? అయినా మీరు ఆందోళన చెందొద్దు. నేను చూసుకుంటా!"నంది' అని తండ్రి గుర్తు చేసుకున్నారు

### ఆర్థిక ఇబ్బందుల్లోనూ...

'ఆమె చిన్నతనంలో, మేం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. ఆమెకు అప్పుడు ఐదేళ్లు ఉంటాయనుకుంటా. ఆమెకు దానిమ్మ పండ్లంటే బాగా ఇష్టం. ఒకసారి నడుచుకుంటూ వెళ్తూ దారిలో దానిమ్మ పండ్లను చూసి, "బాపి, దానిమ్మలు కొనవా?" అని అడిగింది. తన కోసం ఆమె ఇప్పటివరకు ఏదీ అడగలేదు..' అని తండ్రి కన్నీళ్లు పెట్టుకున్నారు.

'మేం చాలా పేద కుటుంబం నుంచి వచ్చాం. ప్రతి ఒక్కటీ మేం సొంతంగా నిర్మించుకున్నదే. మీ కూతురుని డాక్టర్‌ను చేయించలేరని అందరూ అనేవారు. కానీ, అలా అన్న ప్రతి ఒక్కరూ తప్పు అని నా కూతురు నిరూపించింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆమెకు అడ్మిషన్ వచ్చింది' అని చెప్పారు.

వారు ఉంటున్న గదిలో టైలర్‌గా చేసే తండ్రికి చెందిన పరికరాలు, కుట్టుమిషన్, దారం, చిన్న చిన్న బట్టల ముక్కలు పడి ఉన్నాయి. లివింగ్ రూమ్ పక్కనే మెట్లు. ఆ మెట్లు బాధితురాలి బెడ్‌రూమ్‌కు వెళ్లే దారి. గత 11 రోజులుగా ఆ గది మూసే ఉంది. ఆగస్టు 10వ తేదీ నుంచి ఆమె తల్లిదండ్రులు కూతురి గదిలోకి అడుగుపెట్టలేదు.

### బాధ్యతతో ధైర్యంగా...

'చిన్నప్పుడు, టీచర్లు ఆమెను ఎత్తుకుని స్కూల్‌కు తీసుకెళ్లేవారు. తన భుజాలపై ఉన్న బాధ్యతల గురించి ఎప్పుడూ ధైర్యంగా ఉండాలనుకునేది. మాకు ఒక్కగానొక్క కూతురు. ఏ విషయాన్నైనా నేర్చుకోవాలనే తాపత్రయం చిన్నప్పటి నుంచి తనకు ఎక్కువగా ఉండేది. స్కూల్‌లో టీచర్లు తనను చూసి ముచ్చటపడేవారు' అని తండ్రి మాట్లాడేటప్పుడు.. ఆమె తల్లి తన చేతికి ఉన్న ఎరుపు, తెలుపు గాజుల మధ్యనున్న బంగారు గాజును పదేపదే సర్దుకుంటూ.. తన కూతురితో కలిసి ఆమె ఆ గాజు కొనుక్కున్నట్లు చెప్పారు.

### మమతపై విశ్వాసం కోల్పోయాం..

'ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విశ్వాసం కోల్పోయాం! ఈ ఘటనలో చాలా మంది ప్రమేయం ఉన్నట్లు అనుమానం ఉంది. ఇంతకు ముందు బెంగాల్ ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం ఉండేది. కానీ ఇప్పుడు లేదు. న్యాయం జరగాలని మమత చెబుతున్నారు. కానీ దానికోసం ఆమె ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. మా కుమార్తె డైరీలోని ఒక పేజీని సిబిఐకి అందించాం!' అని తండ్రి చెప్పారు. తల్లి మాట్లాడుతూ 'ఆ రోజు శుక్రవారం ఉదయం 10:53 గంటలకు "మీ కూతురికి ఆరోగ్యం బాగాలేదు" అని ఆసుపత్రి వాళ్లు ఫోన్ చేసి, చెప్పి వెంటనే కాల్ కట్ చేశారు. తర్వాత ఫోన్ చేసి ఏం జరిగిందో చెప్పండి అని ప్రశ్నిస్తే.. ఆసుపత్రికి రమ్మన్నారు. "మీ కూతురు ఆత్మహత్య చేసుకుంది!" అని అక్కడున్న ఓ అసిస్టెంట్ మాతో చెప్పింది. విషయం తెలిసిన వెంటనే మేము అక్కడకు వెళ్లాం. మమ్మల్ని హాల్లోకి వెళ్లేందుకు అనుమతించలేదు. తీరా మధ్యాహ్నం మూడు గంటలకు లోపలికి పంపారు. నా కుమార్తెను చూసి కుంగిపోయాను...నా కూతురిని అలా చూడగానే ఎవరో హత్య చేసినట్లు అనిపించింది. "నా కుమార్తె ఆత్మహత్య చేసుకోలేదు ఎవరో చంపేశారు!" అని అక్కడున్న వారితో అప్పుడే చెప్పాను. నా కూతురును డాక్టర్‌ను చేయడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. చివరకి ఆమెను ఇలా హత్య చేశారు' అని ఏడుస్తూ చెప్పారు.

- స్పెషల్ డెస్క్

# ఆరోగ్య ప్రదాతలపై అకృత్యాల పర్వం




కోల్‌కతా లోని ఆర్.జి. కర్ మెడికల్ ఆస్పత్రిలో ఆగస్టు 9న ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అమానుష సంఘటన కలకలం రేపింది. పశ్చిమబెంగాల్‌తో పాటు, దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. డాక్టర్లతో పాటు మహిళలు, యువకులు, విద్యార్థులు రోడ్ల మీదకు వస్తున్నారు. నిరసన గళం వినిపిస్తున్నారు. ఇదొక్కటే కాదు. నిజానికి ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టే వైద్యరంగంలో మహిళలు ఈ తరహా వేధింపులను తరచూ ఎదుర్కొంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే ఆరోగ్య ప్రదాతలపై అకృత్యాల పర్వం సాగుతోంది.

**ఫిబ్రవరి 2021 :** ఒక వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్ ఒకరు సీనియర్ రెసిడెంట్ డాక్టర్ నుండి లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై అంతర్గత విచారణ కమిటీ నిర్వహించిన విచారణలో ఈ ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని తేలింది. కానీ, నిందితుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**జులై 2023 :** ముంబయిలోని నానావతి మాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని రెసిడెంట్ డాక్టర్ ఒకరు సీనియర్ క్లినికల్ కన్సల్టెంట్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినప్పుడు ఉద్యోగానికి భద్రత ఉండదంటూ హెచ్ఆర్ విభాగం నుండి బెదిరింపులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

**డిసెంబర్ 23 :** ఢిల్లీలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు మహిళా ఉద్యోగులు తమ మేనేజర్, సూపర్ వైజర్‌ల లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఇంకా విచారణ జరుగుతోంది.

**ఫిబ్రవరి 24:** రోగి నుండి లైంగిక వేధింపులు ఎదుర్కుంటున్న నర్సు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### ఈ సంఘటనలు కూడా ...

**జూన్ 2021 :** కోవిడ్ బారిన పడిన తన భర్తకోసం ఆస్పత్రికి వెళ్లిన ఒక మహిళ లైంగిక వేధింపులకు గురైంది. దీనిపై ఆమె ఫిర్యాదు చేసింది. అనంతరం జరిగిన పరిణామాల్లో ఆమె తన భర్తను కోల్పోవాల్సి వచ్చింది. బీహార్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయింది.

**జూన్ 2020 :** ఉత్తర ప్రదేశ్‌లోని ఒక ఆస్పత్రిలో 25 సంవత్సరాల మహిళపై వరుసగా రెండు రోజుల పాటు లైంగిక దాడి జరిగింది. కోవిడ్ సమయంలో ఐసోలేషన్ వార్డులో ఈ అమానుష కాండ చోటుచేసుకుంటోంది. ఆస్పత్రి నుండి డిశ్చార్జి అయిన రెండు రోజులకే అధిక రక్తస్రావంతో ఆమె మరణించారు. ఈ ఘటనలో నిందితుడికి ఎటువంటి శిక్ష పడలేదు.

### ఈ గణాంకాలను చదవండి

తాజా అమానుష కాండ చోటుచేసుకున్న కోల్‌కతా నగరం కేంద్రంగా ఈ అధ్యయనం జరిగింది. నాలుగు ఆస్పత్రుల్లో పని చేస్తున్న వివిధ హోదాల్లో ఉన్న 135 మంది మహిళలను కలిసి నిర్వహించిన ఈ పరిశోధనలో 128 లైంగిక వేధింపుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహిళా వైద్యులు, నర్సులు, అటెండర్లతో పాటు అక్కడ పనిచేసే వైద్యేతర సిబ్బంది కూడా ఈ వేధింపులకు గురయ్యారు. వేధింపుల తీరు ఇలా...

**మాటల ద్వారా : 41 కేసులు**
**మానసిక వేధింపులు : 45 కేసులు**
**అసభ్యకర సైగలు : 15 కేసులు**
**అవాంఛిత స్పర్శ** : 27 కేసులు

ఈ సర్వేలో పాల్గొన్న వారు తమపై నేరుగా అత్యాచారం, అత్యాచార యత్నం జరిగినట్లు చెప్పలేదు. కానీ, తమ సహచరులు అనేక మంది అటువంటి దురాగతాల బారిన పడ్డట్టు, తాము వేధింపులను మాత్రమే ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఇలా చెప్పినవారిలో కూడా అత్యధికులు తాము ఎదుర్కొన్న అనుభవాల గురించి ఫిర్యాదు చేయలేదు. ఉన్న కొద్దిపాటి ఉపాధి కూడా పోతుందన్న భయమే దానికి కారణం. ఈ సర్వే జరిగి కొన్ని సంవత్సరాలు గడిచినప్పటికీ, పరి స్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదనడానికి తాజా దుర్ఘటనే నిదర్శనం!

### వేధింపుల ప్రభావం ఏమిటి?

వైద్య, ఆరోగ్య రంగంలో చోటు చేసుకుంటున్న లైంగిక వేధింపులను చాలా మంది చూసీ చూడనట్లు ఊరుకుంటున్నారు. ఫిర్యాదులు ఇచ్చినా పెద్దగా ఫలితం ఉండటం లేదు. కానీ బాధిత మహిళలు మాత్రం తీవ్రమైన దుష్పరిణామాలకు గురవుతున్నారు.

### తీవ్ర మానసిక కుంగుబాటు

ఎక్కువ మంది బాధితులు తీవ్రమైన మాససిక కుంగుబాటుకు గురవుతున్నారు. నిద్ర పట్టకపోవడం, ఒంటరిగా ఉండాలంటే భయానికి గురవుతున్నారు. కొందరు భావోద్వేగాలను ఏమాత్రం నియంత్రించలేక పోతున్నారు. ఈ ప్రభావం పనిపై పడటంతో రోగులకు సరైన సేవలు అందించలేకపోతున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 50 శాతానికి పైగా తాము ఆ లక్షణాలను అనుభవిస్తున్నట్లు చెప్పారు.

### కెరీర్‌పై ప్రభావం

తీవ్ర స్థాయిలో వేధింపులకు గురైనవారిలో పలువురు తమ కెరీర్‌ను పూర్తిగా మానుకుంటున్నారు. కొందరు పనిచేస్తున్న ప్రదేశం నుండి వేరే ప్రదేశానికి మారగా, మరికొందరు ఆరోగ్య పరిరక్షణ రంగం నుండే తప్పుకుంటున్నారు. పనిచేస్తున్న వారు కూడా వైద్య సేవలు అందించడంపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించలేక పోతున్నారు.

### ప్రజల విశ్వాసం కోల్పోవడం

ఆరోగ్య రంగంలో చోటు చేసుకుంటున్న వేధింపులపై పెద్దగా చర్యలు లేనప్పటికీ, స్థానిక ప్రజల్లో మాత్రం విస్తృతంగా ప్రచారమౌతున్నాయి. దీంతో ఆ ఆరోగ్య సంస్థలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

### గోప్యత ఎందుకు? సుప్రీం కోర్టు ఏం చెప్పింది?

వైద్య ఆరోగ్య రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం 2023 మే లో నేషనల్ మెడికల్ కమిషన్‌కు, అలాగే దీంతో సంబంధమున్న అన్ని ఆరోగ్య సంరక్షణ సంస్థలకు పలు ఆదేశాలు జారీ చేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ చేయడానికి ప్రతి సంస్థ తప్పనిసరిగా అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. 2013 నాటి పోష్ చట్టంలోని అంశాలను తు.చ తప్పకుండా పాటించాలని చెప్పింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కూడా ఈ తరహా ప్రవర్తనపై చర్యలకు ఉద్దేశించిన చాప్టర్ 7ను పాటించి తీరాలని ఆదేశించింది.

- పొగడ దొరువు

### మన దేశంలోనేనా ?

ఆరోగ్య రంగంలో లైంగిక వేధింపులు మన దేశంలోనే కాదు. అనేక ఇతర దేశాల్లో కూడా చోటు చేసుకుంటున్నాయి. ఒక అంతర్జాతీయ సంస్థ ఆసియా, ఆఫ్రికా, యూరప్ లోని పలు దేశాల్లో ఈ తరహా వేధింపులపై అధ్యయనం చేసింది. ఆ నివేదిక ప్రకారం ఆరోగ్య రంగంలోనూ తక్కువ, మధ్య స్థాయి ఆదాయం ఉన్నవారిపైనే పెద్ద ఎత్తున లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. సర్వేలో పాల్గొన్న మహిళా డాక్టర్లలో 90 శాతం మందికి పైగా తాము ఏదో సందర్భంలో విధి నిర్వహణలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఈ సర్వేలోని కొన్ని వివరాలు ...

**వేధింపులు ఎక్కడ?**

| స్థలం | శాతం |
|---|---|
| కారిడార్ | 10 |
| డాక్టర్, నర్సింగ్, ఎగ్జామినేషన్ రూం | 46.9 |
| ఫార్మసీ | 2.3 |
| ల్యాబ్ | 2 |
| రిసెప్షన్ | 6.9 |
| మెట్లు, లిఫ్ట్,కారిడార్ | 23 |
| సర్జరీ థియేటర్ | 3.8 |

**వేధింపులు ఎన్ని సార్లు?**

| | |
|---|---|
| ఒకసారి | 16.9 |
| రెండు సార్లు | 23.8 |
| మూడు సార్లు | 13.8 |
| మూడు కన్నా ఎక్కువ | 45.4 |

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68